లేజర్ చికిత్స
- అత్యంత అధునాతన లేజర్ పరికరంతో చిగుళ్ల వ్యాధికి ప్రత్యేక చికిత్స.
- 7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన ఏకైక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబసభ్యులకు రీయంబర్స్‌మెంట్ సదుపాయం కలదు.
డాక్టర్ అబూరు స్వరూపికుమారరెడ్డి, M.D.S
Professor, Endodontics
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పాగతోట, నెల్లూరు. ఫోన్ : 2303300.

Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షణము

సంపుటి: 82 • సంచిక: 31 • 27-7-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

Hotel D.S.R Paradise

అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

ఫ్యాక్షన్ అలవాటు పాటిస్తున్నారా?

- వైఎస్ చావుపై అనుమానాలు విజయమ్మకెందుకు గుర్తుకు రావడం లేదు?
- సిరిసిల్ల ధర్నాకు కిరణ్ సహకారంలోని మర్మమేమిటి?
- రాజీపై ప్రతిపక్షాలు గోలచేస్తున్నా "సాక్షి" బదులు పలకదేమి?

రాష్ట్రంలో ఏమి జరుగుతున్నది? రాజకీయాలు ఏ దిశలో ప్రయాణిస్తున్నాయి? శత్రువులు మిత్రులు, మిత్రులు శత్రువులుగా మారుతున్నారా? ఈ పునరేకీకరణలకు ప్రాతిపాదిక ఏమిటి? రాజకీయ పార్టీలు ప్రజలను వెర్రి వెంగళప్పలుగా జమకడుతున్నాయా? తామేమి చేసినా జనం నోరు మూసుకొని వుంటారనే చులకన అభిప్రాయం వాటిలో బలీయంగా వుందా? జగన్ పట్ల కాంగ్రెస్, కాంగ్రెస్ పట్ల జగన్ అనుసరిస్తున్న వైఖరి చూస్తుంటే ఇదే భావన కల్గుతున్నది.

తాత్కాలికంగా బెయిల్ కోసమో, లేక శాశ్వతంగా జైలు జీవితం నుంచి విముక్తి కోసమో వైఎస్ జగన్ కాంగ్రెస్ పెద్దలతో రాజీ కుదుర్చుకొన్నారన్న పదంతులు విస్తృతంగా వ్యాప్తిలోకి వస్తున్నాయి. తెలుగుదేశం నేతలు అది పనిగా ప్రతిరోజు, పదే పదే ఈ విమర్శ చేస్తున్నారు. కానీ అటు జగన్, ఇటు కాంగ్రెస్ పెద్దలు దొంగకు తేలు కుట్టినట్లు మౌనంగా వుండి పోతున్నారే తప్ప నోరు విప్పి మాట్లాడడం లేదు. ఈ వదంతి నిజమా, అబద్దమా అన్న వివరణ ఇవ్వడం లేదు. తమ మీద ఈగ వాలితే ఏనుగు పడినంత ఆగం చేసే సాక్షి పత్రిక, సాక్షి టీవీ అసలీ విమర్శలేవీ తమ చెవిన పడనట్లే గమ్ము నుండి పోతున్నాయి. ఎవరికి తోచినది వారు వూహించుకోవచ్చు అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. దానితో ప్రజలు అయోమయానికి గురౌతున్నారు. ఏది నిజమో ఏది పుకారో అర్థం కాక జుట్టు పీక్కొంటున్నారు. లక్షల సంఖ్యలో వున్న జగన్ అభిమానులకు ఈ పరిస్థితి చాలా సంకటంగా వుంది. వచ్చే ఎన్నికలలో జగన్ తుపాను వీస్తుందని, ముఖ్యమంత్రి

కొరవ 14వ పేజీలో

ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రప్రథమం

హ్యాపీ డెంటల్ హాస్పిటల్‌లో 'వేవ్ ఒన్ టెక్నాలజి'తో రూట్ కెనాల్ చికిత్స

- అందరికీ అందుబాటులో ఆధునిక దంత వైద్యం
- వేవ్ ఒన్‌తో రూట్‌కెనాల్ చికిత్స ఇక సులభం.
- లేజర్ సహకారంతో అధిక సక్సెస్ రేట్

పన్ను పీకకుండా కాపాడే చికిత్స రూట్‌కెనాల్ చికిత్స. గంటల తరబడి, రోజుల తరబడి చేసే రూట్ కెనాల్ చికిత్సను 10-15 నిమిషాలలో చేయగల వేవ్ ఒన్ టెక్నాలజిని మొట్టమొదటసారిగా నెల్లూరుకు పరిచయం చేసింది హ్యాపీ డెంటల్ హాస్పిటల్.

ఎక్కువగా చెడిపోయిన దంతాలను సాధారణ స్థితికి తీసుకువచ్చే అద్భుతమైన దంత వైద్య ప్రక్రియ రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్. ఈ చికిత్సా విధానంలో మొదట స్కానింగ్ ద్వారా పిప్పి ఎంత వరకు పరిమితమైందో జబ్బు తీవ్రతను పరిశీలిస్తారు. తర్వాత ఆ పంటి వరకు మాత్రమే మత్తు మందు ఇచ్చి నొప్పి తీవ్రతను తగ్గిస్తారు.

పంటిని వేవ్ ఒన్ ఫైల్స్ అనే ఆధునిక సాధనాలతో పంటి వేరు చివరి భాగం వరకు ఇన్‌ఫెక్షన్ తీసేసి స్టెరిలైజ్ చేస్తారు.

కెనాల్స్‌ను సిమెంట్‌తో నింపి దానికి క్యాప్ వేస్తారు. దీని వల్ల పన్ను చిరకాలం వుంటుంది.

గతంలో సూదులవంటి సాధనాలతో 4 నుండి 5 రోజులపాటు, ఒక్కొక్కసారికి గంటల సేపు ఇన్‌ఫెక్షన్ శుభ్రం చేసేవారు. హ్యాపీ డెంటల్ హాస్పిటల్‌లోని వేవ్ ఒన్ టెక్నాలజి ద్వారా ఈ ప్రక్రియను కేవలం 10-15 నిమిషాలలో సుల భంగా పూర్తి చేయడం సాధ్యం.



హ్యాపీ డెంటల్ హాస్పిటల్
డాక్టర్ రామచంద్రారెడ్డి హాస్పిటల్ ఎదురుగా
బృందావనం, నెల్లూరు.



మరిన్ని వివరాలకు...
హ్యాపీ డెంటల్ హాస్పిటల్, డాక్టర్ రామచంద్రారెడ్డి హాస్పిటల్ ఎదురుగా, బృందావనం, నెల్లూరు.
ఫోన్ : 2349555, 92464 25550.





[వరమా? శాపమా?]

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులు చూస్తుంటే విచారం కలుగుతున్నది. గోదావరి నది మీద పోలవరం గ్రామం సమీపంలో ప్రాజెక్ట్ నిర్మాణం చేస్తే, వృధాగా సముద్రంలోకి వెళ్తున్న వందలాది టిఎంసిల నీటితో బీడు పొలాలను సస్యశ్యామలం చేయవచ్చన్న ఆలోచన దాదాపు 65 సంవత్సరాల క్రితం కల్గింది. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం, హైదరాబాదు పాలకుడు నిజాం నవాబుతో జత కలిసి దీనిపై పరిశీలన జరిపింది. కేవలం ఆరు కోట్ల రూపాయల ఖర్చుతో ప్రాజెక్ట్ నిర్మాణానికి డిజైన్లు కూడా తయారయ్యాయి. కానీ ఏ కారణం వల్లనో అది ఆచరణకు రాలేదు.

ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నదులు సంధానం ప్రణాళిక క్రింద ఈ ప్రాజెక్ట్ పరిశీలన జరిపింది. గోదావరిలో కనీసం 650 టిఎంసిల నీరు మిగులు వుంటాయని, కృష్ణానదికి వాటిని మళ్లిస్తే ఆంధ్ర రాష్ట్రంలో సాగు యోగ్యం కాని భూమి అనేది లేకుండా పోవడంతోపాటు, వేలాది గ్రామాలు, పట్టణాలకు శాశ్వతంగా మంచినీటి సరఫరా సమస్య తీరి పోతుందని అంచనా వేశారు నిపుణులు. 2025 సంవత్సరం లోపల హిమాలయాల నుంచి ప్రవహించే గంగ, బ్రహ్మపుత్ర వంటి నదులను దిగువ రాష్ట్రాలకు మళ్లించకుంటే భారత దేశం వూహ కందని స్థాయిలో సాగు నీరు, త్రాగు నీరు సమస్య ఎదుర్కొంటుందన్నది నిపుణుల అంచనా. అందులో భాగంగా పోలవరం ప్రాజెక్టును నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం తల పెట్టింది. దానికి అనుగుణంగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. అందులో ఆయన స్వార్థం కూడా కొంత వుంది. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలో నిర్మిస్తున్న నీటిపారుదల ప్రాజెక్ట్‌లకు కృష్ణా నదీ జలాలే ఆధారం. అయితే వాటికి కృష్ణలో నికరమైన జలాల నుంచి కేటాయింపులు లేవు. కేవలం వరద వచ్చిన సంవత్సరంలో మాత్రమే రాయలసీమకు నీరివ్వాలి. ఈ అనిశ్చితి తొలగించడానికి పోలవరం ఒక్కటే శరణ్యమని భావించాడు వైఎస్. పోలవరం ప్రాజెక్ట్ నుంచి 200 టిఎంసిలకు పైగా గోదావరి నీటికి కృష్ణానదికి మళ్లించి, కృష్ణా డెల్టా రైతాంగానికి ఆ నీటిని ఇచ్చి, అందుకు బదలుగా రాయలసీమకు కృష్ణా నీటిని వాడుకోవాలని తలపోశాడు వైఎస్. అందుకోసం పోలవరం నుంచి చిన్నపాటి నదులను తలపించే స్థాయిలో భారీ కాలువల వ్యవస్థ నిర్మాణం చేపట్టాడు. అయితే పోలవరం ప్రాజెక్ట్‌ను అంగుళం ముందుకు జరపలేక పోయాడు. అందుకు కారణం ఒరిస్సా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల అభ్యంతరం. పోలవరం నిర్మిస్తే తమ రాష్ట్రంలోని భూభాగం మునకకు గురౌతుందని వారు అడ్డు పెట్టారు. దానితో నిజాం హయాంలో తలపెట్టిన సముద్ర మట్టానికి 208 అడుగుల ఎత్తు బదలు కేవలం 150 అడుగుల ఎత్తులో ప్రాజెక్ట్ నిర్మిస్తామని ప్రతిపాదించింది మన రాష్ట్ర ప్రభుత్వం. దాని వల్ల నీటి నిల్వ సామర్థ్యం 836 టిఎంసిల నుంచి కేవలం 75 టిఎంసిల స్థాయికి పడిపోతుంది. అయినా, గోదావరికి దాదాపు ఆరు నెలలు వరద వుంటుంది కాబట్టి, వచ్చిన నీటిని వచ్చినట్లు కృష్ణకు తరలించవచ్చునని భావించారు. అయితే దానికీ ఒరిస్సా అంగీకరించలేదు. ప్రాజెక్ట్ నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహానికి మాత్రమే ప్రాజెక్ట్ డిజైన్ చేశారని, అంత కంటే ఎక్కువ వరద వస్తే తమ ప్రాంతం మునిగి పోతుందని ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అడ్డుపుల్ల వేశాడు. ఆయనకు నచ్చ చెప్పే లోపలే వైఎస్ మరణించారు. దానితో ప్రాజెక్ట్ కదలిక నిలిచిపోయింది.

జమీన్‌రైతు

మరొకప్రక్క ప్రాజెక్ట్ నిర్మాణానికి కాంట్రాక్ట్ కేటాయింపు పెద్ద వివాదంగా మారింది. ఇంత భారీ ప్రాజెక్ట్ నిర్మించిన అనుభవం దేశంలో ఒక్క కంపెనీకి కూడా లేదు. కానీ అందరికీ దాన్ని దక్కించుకోవాలని కోరిక. ఆ పోటీలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకొన్నాయి. ఇప్పటికి రెండు సార్లు ఖరారైన టెండర్లు రద్దు చేశారు. ఇప్పుడు మూడో సారి కూడా వాటి గతి దుర్గతిగానే వుంది.

దేశ విశాల ప్రయోజనాలకు ఉద్దేశించిన ప్రాజెక్ట్ నీచమైన కాంట్రాక్ట్ వ్యాపారాలకు, సంకుచితమైన రాజకీయాలకు బలైపోవడం విచారకరం. ప్రధాని వంటి వారు జోక్యం చేసుకొంటే తప్ప రాళ్ల సీమ అయిన రాయలసీమను సస్యశ్యామలం చేసే ఈ ప్రాజెక్ట్‌కు మోక్షం కలగదు.

జనవాణి

వంద అడుగుల రోడ్డు వేయండి!

నెల్లూరు ముత్తుకూరు రోడ్డులోని కాల్వ కట్టపై వుండిన గుడిసెలన్నింటిని క్షణాల్లో మునిసిపల్ పాలక వర్గం కూల్చి వేసింది. రోడ్లు వెడల్పు చేస్తామని, దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా నడుస్తుందని చెప్పారు. రోడ్డు విస్తరణ పేరుతో పన్నెండు అడుగులు మాత్రమే రోడ్డు వేస్తున్నారు. దీనివల్ల మళ్లీ దురాక్రమణల పర్వం మొదలవుతుంది. గుడిసెలు కూల్చిన ఆర్డీఓ, ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని పరిశీలించి వంద అడుగుల రోడ్డు వేయించమనవి.

ఎం.శ్రీనివాసులు — నెల్లూరు

సూదిలా వచ్చి దబ్బనంలా మారింది

సూదిగా వచ్చి దబ్బనంలా మారిన సోనియాగాంధీ గమనం దేశానికి కీడో మేలో తెలియకుంది. దేశంలో సకల విధానపరమైన నిర్ణయాల మీద ఆమె నీడసోకుతోంది. రాజీవ్‌గాంధీని పెళ్లి చేసుకొన్నా ఆమె విదేశీ వనితనే. ఎమ్పీ కావచ్చు, యుపిఏ చైర్‌పర్సన్ కావచ్చు. అబ్దుల్ కలాం బోటి వాళ్లు రాజ్యాంగంలోని కొన్ని మెలికల ఆధారంగా ఆమెను ప్రధానిని చేయాలని తలవచ్చు. 150 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీకి దేశంలో పుట్టిన ఒక్క నాయకుడు నాయకత్వం వహించే విధంగా ఎదగకపోవడం దేశం చేసుకొన్న దౌర్భాగ్యం.

వాస్తు రామచంద్ర — నెల్లూరు

తీర్పును గౌరవించండి!

కేంద్ర ప్రభుత్వం 27శాతం రిజర్వేషన్లు బిసిలకు నిర్ణయించడం జరిగింది. ఈ 27శాతం నుండి మైనార్టీలకు (విద్య, ఉద్యోగాల్లో) 4.5శాతం ఉపకోటా యివ్వడం తప్పని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయం దేశ జనాభాలో 54శాతం వున్న 65కోట్ల మంది బలహీన వర్గాల వారికి ఆనందం కలిగించినది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలి.

డి.సాయిరాం — కోవూరు

విద్యాబోధన అడుగంటింది!

ర్యాంకులు, ఉత్తీర్ణతా శాతం పోటీలో కార్పొరేట్ కాలేజీలు అనేక అవకతవకలకు పాల్పడుతున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జంబ్లింగ్ విధానం అమలు కాకుండా సఫలీకృతమయ్యారు. సెల్ఫ్ సెంటర్ల విధానంలో ఏ విద్యార్థి ఏ కాలేజీలో చదివాడో అదే కాలేజీలో పరీక్ష రాయాల్సి వుంటుంది. అందుకే ప్రాక్టికల్స్‌లో నూటికి నూరుశాతం మార్కులు వస్తాయి. మార్కులైతే వస్తున్నాయిగానీ వీరి నాలెడ్జి మాత్రం అదే నిష్పత్తిలో పెరగడం లేదు. ఆలిండియా పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం తక్కువగా వుంటోంది. ప్రభుత్వం మేధావి వర్గంతో

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

31-7-1942
పేజీలు : 8 వెల: అణా

పోస్టు ద్రవ్యాపహరణం

సైదాపురం పోస్టులో పంచాయతీ బోర్డు ద్రవ్యం రూ.400లు అపహరణం జరిగిందని, పోస్టు మాస్టర్ను అరెస్టు చేశారనీ, ఆ పని ఒక టీచరుకు యిచ్చారని తెలుస్తున్నది.

సుందరయ్య

పుచ్చలపల్లి సుందరయ్య మూడు సంవత్సరాలుగా పోలీసులకు దొరకకుండా రహస్యంగా పనిచేస్తుండి వారి పార్టీ మీద నిషేధాన్ని తీసివేసిన తర్వాత నెల్లూరు వచ్చారు. 30వ తేది సాయంత్రం సత్రం వద్ద యుద్ధ ధోరణిని గూర్చి ఉపన్యసించారు.

కలరా

ఆత్మకూరు తాలుకాలో 12 గ్రామాల్లో కలరా ఉంది. 171 మందికి తగిలి 80 మంది చనిపోయారు అందులో. తాడిపర్తిలో మాత్రం 88 మందికి తగిలి 43 మంది చనిపోయారు. ఇప్పుడు తాలుకాలో చాలా భాగం నెమ్మదించింది.

పెళ్లూరు

వూళ్లో టెంకాయల ఖర్చు తగ్గిపోయింది. అలజడి వర్తకుల్లో. విచారిస్తే శివాలయం పాడుబడ్డది. ఆలయంలోకి వెళ్లిన భక్తులంతా టెంకాయల్తో యిల్లు చేర్తున్నారు శివుడి నోట్లో మట్టిగొట్టి. ఆదాయం పగిలిపోయిన లాంతర్ల రిపేరికి పెట్టమన్నారట పంచాయితీ బోర్డువారు. ఈ విషయం తహశీల్దారు వారి కళ్లకు, మనస్సుకు, కలానికి తెలిసినదే. కానీ టైం రాలేదు కాబోలు.

–బాటసారి

50 ఏళ్ల క్రితం ఈవారం

27-7-1962
పేజీలు: 8 వెల: 0-20 న.పై

నటి నగల చోరీలో నెల్లూరు యువకుని అరెస్ట్!

మద్రాసు నగరంలోని మాంబళంలో నివాసముంటున్న మాజీ సినీతార కమలాదేవి(పూర్వాశ్రమంలో కమలా కోట్నీస్) గృహంలో ఈ నెల 24వ తేది జరిగిన దొంగతనంలో షుమారు మూడు లక్షల రూపాయల విలువ గల నగల చోరీ సందర్భంలో నెల్లూరు తాలుకా గంగపట్నం వాసి కొండూరు చంద్రశేఖర్‌రెడ్డిని 26వ తేది రాత్రి నెల్లూరు ట్రంకురోడ్డులోని 'అజంత' హోటల్‌లో సంతపేట పోలీసు సహాయంతో మద్రాసు క్రైం బ్రాంచి సబ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.జయరాం అరెస్టుజేసి టౌన్ స్టేషన్ లాకప్‌లో ఉంచినట్లు; మద్రాసు నుండి వచ్చిన పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ రామలింగం, మరి ఇరువురు సబ్ ఇన్స్‌పెక్టర్లు ఆనాటి రాత్రి మూడు గంటలప్పుడు అతనిని వ్యాన్‌లో మద్రాసుకు తీసుకపోయినట్లు తెలుస్తున్నది. ఈ నెల 24వ తేది 2 లక్షల రూపాయలు విలువచేసే ఒక డైమండు నెక్లెస్ రెండు డైమండ్ ఉంగరాలను కొనుటకు ఒక నగల వ్యాపారి రాగా వాటిని అతనికి చూపించుటకు, తన మేనేజరుగా వ్యవహరిస్తున్న ఈ చంద్రశేఖర్‌రెడ్డిని నియోగించారని తర్వాత కొంత సేపటికి చంద్రశేఖర్‌రెడ్డి ఆ నగలతో పరారయ్యాడని కమలా కోట్నీస్ మాంబళం పోలీసుకు రిపోర్టు యిచ్చిందని, దానిపై చంద్రశేఖర్‌రెడ్డిని నెల్లూరులో అరెస్ట్ చేయడం జరిగిందని తెలుస్తున్నది.

కమ్యూనిస్టుకు శిక్ష

పంచాయితీ ధన దుర్వినియోగపు నేరం ఆరోపించబడి, కావలి మున్సిఫ్ మేజిస్ట్రేటుచే రెండు నెలల శిక్ష, 200 రూపాయల జరిమానా విధింపబడిన తలమంచి పంచాయితీ మాజీ అధ్యక్షుడు జొన్నా కోటయ్య అప్పీలు చేయగా జిల్లా జడ్జి సమియుద్దీన్ మహమ్మద్ విచారించి, అంతవరకు అనుభవించిన ఆరు రోజుల శిక్షను, 200 రూపాయల జరిమానా ఖాయం జేస్తూ 19వ తేది తీర్పు చెప్పారు.

నెల్లూరు ముచ్చట్లు

బెజవాడ గోపాలరెడ్డి అవార్డు!

ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్, సాహితీవేత్త డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి పేరిట ప్రతి ఏడాది ఇచ్చే పురస్కారానికి ఈ యేడాది తమిళనాడు గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్యను ఎంపిక చేశారు. ఆగష్టు 5వ తేది ఉదయం 11 గంటలకు టౌన్‌హాలులో ఈ అవార్డు ప్రదానోత్సవ సభ జరుగుతుంది. సభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎస్పీ రమణకుమార్, మాజీ ఎమ్పీ మాగుంట పార్వతమ్మ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోట గురుబ్రహ్మం పాల్గొంటారు. సభకు ముందు మాస్టర్ ఆదర్శ్, కుమారి నదియాల శాస్త్రీయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఉంటుంది. నెల్లూరీయులను ఈ వేడుకకు తరలి రమ్మంటున్నారు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జెవిరెడ్డి, బివి నరసింహం.

బాల యోగీశ్వరాశ్రమం స్థలం పరిస్థితేమిటి?

నెల్లూరు వేదాయపాళెంలో వందల కోట్ల రూపాయలు విలువచేసే బాల యోగీశ్వరాశ్రమం స్థలాన్ని అక్రమార్కులు అమ్మేస్తుంటే ఏం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని వివరణ అడిగినట్లు తెలిసింది. ఈ వ్యవహారమై పూర్తి సమాచారంతో 31వ తేది హైదరాబాద్‌కు హాజరు కమ్మని కలెక్టరేట్‌కు తాఖీదు అందించింది. రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ముఖ్య అనుచరుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి ఈ స్థలాన్ని తన స్వంత స్థలంగా అమ్మేసిన విషయం పాఠకులకు తెలిసిందే.

బోర్డు మాత్రమే... బియ్యం లేవు!

బియ్యం ధరలు ఆకాశానికి అంటిన ప్రస్తుత తరుణంలో మధ్యతరగతి ప్రజల కోసం రైతుబజార్లలో కిలో 27 రూపాయలకే జిలకర మసూరి బియ్యం అందుబాటులోనికి తెస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం ప్రకటించారు. నెల్లూరు ఫత్తేఖాన్‌పేట, స్టోన్‌హౌస్‌పేట రైతు బజార్లతోపాటు రైసు మిల్లర్ల అసోసియేషన్ ఆఫీసుల్లో వీటిని విక్రయిస్తున్నట్లు చెప్పారు. రైతు బజార్లలో ఈ అమ్మకాలను సైతం జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ముచ్చటగా మూడు రోజులు సాగిన ఈ అమ్మకాలు ప్రస్తుతం జరగడం లేదు. బహిరంగ మార్కెట్‌లో పాత రకం జిలకర మసూరి కిలో 36 రూపాయలుగా అమ్ముతున్నారు. 27 రూపాయలకు రైతుబజార్లలో విరివిగా అమ్ముతామన్న ప్రభుత్వ వాగ్దానాన్ని లక్ష్మీకాంతం గారే నిలబెట్టాల్సి ఉంది.

జడ్పీ ఆఫీసు మార్చరా?

నెల్లూరు పొదలకూరురోడ్డులో గత ఏడాది కొత్తగా ప్రారంభించిన జిల్లా పరిషత్ కార్యాలయంలోకి పాత కార్యాలయాన్ని మార్చలేదు. జడ్పీ మాజీ చైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధపెట్టి ఈ కార్యాలయాన్ని నిర్మించారు. ఆధునిక హంగులు సమకూర్చారు. అయితే ఈ కార్యాలయాన్ని ఆయన ఆనం సోదరులను పిలవకుండా ప్రారంభించడంతో వాళ్లు ఆయన మీద కోపంతో ఈ కార్యాలయం పాడుపడేట్లు చూస్తున్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రస్తుతం చైర్మన్‌గా లేడు. పాత కార్యాలయం దుస్థితిలో ఉన్న దృష్ట్యా కొత్త కార్యాలయాన్ని వాడుకోనేలా కలెక్టర్ శ్రద్ధ చూపాల్సి ఉంది.

భళా నాగేశ్వరరావు!

గుంటూరు నుంచి నెల్లూరుకు తూనికలు కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్‌గా బదలీ అయిన జలదంకి నాగేశ్వరరావు అక్రమార్కులకు తమ శాఖ తడాఖా చూపిస్తున్నాడు. నెల్లూరు చేపల మార్కెట్ అంతర్జాతీయ ప్రమాణాలతో నడిచేదని వివేకానందరెడ్డి అండ్ కో నిత్యం అబద్ధాలు చెబుతుంటుంది. 22వ తేది ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావునే కిలో 220 రూపాయల చొప్పున రెండు కిలోల రొయ్యలు కొని ఖచ్చితమైన ఎలక్ట్రానిక్ కాటాలో తూకం వేయించగా 1400 గ్రాములే వచ్చింది. వెంటనే తప్పుడు తక్కెడను సీజ్ చేశారు. ఏళ్ల తరబడి మార్కెట్‌లో ఈ తూకాలతో జనం ఎంతగా మోసపోతున్నారో ఈ సంఘటన రుజువు చేస్తుంది. నాగేశ్వరరావుకు తోడుగా డిప్యుటేషన్‌పై మరికొంత మంది ఇన్స్‌పెక్టర్లను నెల్లూరుకు రప్పించి ఈ దాడులను కొన్నాళ్లపాటు కొనసాగిస్తేగానీ నగరంలో తప్పుడు తూకాలతో జనాన్ని మోసగించే వ్యాపారులు దారికి రారు.

రైతుబజారులో ఫ్లోరింగ్ బద్దలు!

నెల్లూరు ఫత్తేఖాన్‌పేటలోని రైతు బజారులో ఫ్లోరింగ్ బద్దబద్దలుగా పగిలిపోయింది. దీన్ని చూస్తే ఎప్పుడో పాత కాలం నాడు పనులు చేపట్టినట్లు కనిపిస్తుంది. వాస్తవానికి ఇక్కడ రైతుబజారు కట్టి పదేళ్లు కాలేదు. అసలు ఈ రైతు బజారు పూర్తిస్థాయిలో నడవనూలేదు. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్, నాణ్యత పరిశీలించక బిల్లులు చేసిన అధికారుల లంచాల దాహానికి ఈ బజారు బద్దలయ్యింది.

శ్రీ బాలాజీ డయోగ్నొస్టిక్స్ ప్రారంభం

నెల్లూరు ఇందిరాభవన్ ప్రక్కన నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ బాలాజీ డయోగ్నొస్టిక్స్ మల్టీ స్పెషాలిటీ ల్యాబొరేటరీని జూలై 22వ తేది తిరుపతి స్విమ్స్ ఫార్మర్ డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. డయోగ్నొస్టిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజి ఎక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రోగ నిర్ధారణ ముఖ్యమన్నారు. కచ్చితమైన రోగ నిర్ధారణ చేసి రిపోర్టులు అందిస్తామన్నారు. హిస్టో ఫెథాలజీ, సైటో ఫెథాలజీ, క్లినికల్ ఫెథాలజీ, హెమటాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ టెస్టులు తమ ప్రత్యేకతన్నారు.

వజ్రం - బంగారం - వెండి ఫ్యాక్టరీ అవుట్‌లెట్

BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*

*T&C Apply

గోల్డ్ ప్యాలెస్

ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్

925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.

*T&C Apply

సిల్వర్ ప్లాజా

EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121

సంస్మృతి



మా అమ్మ

తూపిలి రమణమ్మ

(జిమీన్‌రైతు మేనేజింగ్ ఎడిటర్ స్వర్గీయ తూపిలి పార్థసారథిగారి భార్య)


30.7.92

వనమాలి, ఉష, పేశల
మరియు
కుటుంబ సభ్యులు

దురాక్రమించి మసీదా?

పరిశుభ్రంలేని ప్రాంతాల్లో, దురాక్రమించిన ప్రాంతాల్లో మసీదుల నిర్మాణం కూడదంటుంది ఇస్లాం. కానీ అదే పనిగా దురాక్రమణలకు అలవాటుపడిన మైనార్టీ నేతలు కొందరు ఏదో ఒక స్థలాన్ని దురాక్రమించి మసీదుల నిర్మాణం పేరిట మతాన్ని అల్లరిపాలు చేస్తున్నారు. 22వ తేది నెల్లూరు మన్సూర్

కొరవ 14వ పేజీలో



కే॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాలలో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని తన గుండెలలో దాచుకున్న
ప్రేమమయుడు మా తండ్రి కే॥శే॥ **మాగుంట రాఘవరెడ్డి** గారు.
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

ఆ మహనీయుని **35వ వర్ధంతి** సందర్భంగా
తేది 1-8-2012 బుధవారం నెల్లూరు రంగనాయకులపేటలోని
శ్రీ రాఘవ కళ్యాణ మండపం నందు పేదలకు **అన్నదానం** జరుపబడును.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి, M.P.,

మనుమడు
మాగుంట విజయారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్పీ రాజమోహన్‌రెడ్డి.

ఫ్లోరైడ్ నీళ్లే గ్రామాలకు శాపవిమోచనం!

మంచి పనికి శ్రీకారం చుట్టిన మేకపాటి

నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వంద గ్రామాల్లో ఫ్లోరైడ్ రహిత మంచినీరు అందించను ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రణాళిక రచించారు. ఈ వివరాలను విలేకరులకు వివరిస్తూ పది కోట్ల రూపాయల ఖర్చుతో మంచినీటి ప్లాంట్లను నెలకొల్పేందుకు టాటా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఎంపిక చేసిన గ్రామాల్లో రెండు రూపాయలకే 20 లీటర్ల మంచినీటిని ప్రజలకు అందిస్తామన్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలకు సరైన మంచినీరు అందక అనేక వ్యాధుల బారినపడుతున్నారు. చాలా చోట్ల నీటిలో మోతాదు మించి ఫ్లోరైడ్ ఉంటుంది. దీంతో 20 సంవత్సరాల వయస్సు కల్గినవారు 60 ఏళ్ల వారిలా మారుతున్నట్లు ఎమ్పీ వివరించారు. అందుకే దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్ని గ్రామాల్లో రక్షిత మంచినీరు అందిస్తామని 2009 ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. వైఎస్ జీవించి ఉండుంటే ఆ హామీని ఖచ్చితంగా అమలు చేసేవారు. అయితే ఆయన రెక్కల కష్టంతో ఏర్పడిన ప్రస్తుత ప్రభుత్వం ఆ హామీని తుంగలో తొక్కిందన్నారు. మహానేత హామీని నెరవేర్చేందుకు ఉడతాభక్తిగా స్వంత నిధులు ఐదు కోట్లు, ఎమ్పీ ల్యాడ్ నుంచి మరో ఐదు కోట్లు ఈ పథకానికి వెచ్చిస్తానని రాజమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు.

జనన, మరణ సర్టిఫికేట్లు!

నెల్లూరు కార్పొరేషన్ ఆధునిక సేవల్లో మరింత ముందడుగు వేసింది. త్వరలో నగర ప్రజలకు ఆన్‌లైన్‌లో జనన, మరణ ధ్రువపత్రాలను మంజూరు చేస్తామని కమిషనర్ డాక్టర్ టిఎస్ఆర్ఆంజనేయులు చెప్పారు. 19వ తేది కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జనన, మరణ వివరాలను 1993 నుంచి 2011 వరకు ఆన్‌లైన్ చేశామన్నారు. మిగతా వాటిని కూడా ఆన్‌లైన్ చేస్తామన్నారు. గతంలో మాదిరి ప్రజలు ఇక నుంచి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లవలసిన అవసరం లేదని, వివాహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నమోదు కార్యక్రమాన్ని కార్పొరేషన్ ఆఫీసులో చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజారోగ్యం!

● ప్లానింగ్ కమిషన్ ఎక్సెపర్ట్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాధ్‌రెడ్డి.

పేద ప్రజల వైద్యుడిగా పేరుగడించిన ప్రఖ్యాత వైద్యుడు డాక్టర్ రామచంద్రారెడ్డి హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా విశేష కృషి చేసిన దివంగత డాక్టర్ జెట్టి శేషారెడ్డి పేరు మీద విజ్ఞాన కేంద్రం ఏర్పాటైంది. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. విజ్ఞాన కేంద్రం ప్రారంభం సందర్భంగా నగరంలోని మహేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన సమావేశానికి ప్రముఖ గుండె వైద్య నిపుణులు, ప్లానింగ్ కమిషన్ ఎక్స్‌పర్ట్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనాధ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజారోగ్యం సాధించగల మన్నారు. ప్రజా వైద్యానికి కేటాయింపులు చాలా స్వల్పంగా ఉన్నాయని, పాలకుల్లో చిత్త శుద్ధి కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావైద్యం కోసం థాయ్‌లాండ్ ప్రభుత్వం పెడుతున్న ఖర్చుతో పోలిస్తే మన ప్రభుత్వం పెట్టేది చాలా స్వల్పమని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజం అంటే కేవలం హాస్పిటళ్ల ద్వారా రాదని, పౌష్టికాహారం, విద్య, మంచినీరు, పారిశుద్ధ్యం ద్వారా మాత్రమే లభిస్తుందన్నారు. ప్రాధమిక వైద్యాన్ని పరిపుష్టం చేసేందుకు 346 రకాల మందులను దేశమంతా ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. ప్రజల్లో చైతన్యం వచ్చి ఉద్యమ రూపం దాలిస్తేనే పాలకుల్లో మార్పు వస్తుందన్నారు. డాక్టర్ శేషారెడ్డి ప్రజలకు వైద్యం అందించేందుకు జీవితాంతం శ్రమించాడని, అలాంటి వ్యక్తి పేరున విజ్ఞాన కేంద్రం స్థాపించడం సంతోషకరం అన్నారు. ఈ సమావేశంలో విజ్ఞాన కేంద్రం చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ విరపు బాలసుబ్రహ్మణ్యం, సిపిఎం సీనియర్ నేత జక్కా వెంకయ్య, ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి, ట్రస్టు కార్యదర్శి శ్రీరాములు, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కా వెంకయ్య. వేదికపై డాక్టర్ శ్రీనాధ్‌రెడ్డి తదితరులు.

● విద్యుత్ భవన్‌ను

ముట్టడించిన వైకాపా!

పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలు

ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పదవుల కోసం పాకులాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. విద్యుత్ కోతలకు నిరసనగా విద్యుత్ భవన్‌ను ముట్టడించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటుంటే వాటిని పట్టించుకోకుండా పదవులు కాపాడుకొనేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత విద్యుత్ ప్రవేశపెడితే నేటి పాలకులు దానికి తూట్లు పొడుస్తున్నారని, రైతులను కోలుకోలేకుండా చేస్తున్నారని ఆగ్రహించారు. ఇది ఆరంభం మాత్రమేనని ప్రభుత్వం విద్యుత్ కోతలను ఎత్తివేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉదయగిరి శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్ పథకాలతోపాటు విద్యుత్ పరిశ్రమలను అటకెక్కించడంతో వర్షాకాలంలోనూ విద్యుత్ కోతలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కోతల వలన ఉపాధి లేక కార్మికులు వీధులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ శాసన సభ్యులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, నెలవల సుబ్రహ్మణ్యం, ఆ పార్టీ నేతలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అనిత తదితరులు పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు.



ముట్టడి సందర్భంగా మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి.



ధర్నాలో ప్రసంగిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

విద్యుత్ కోతలకు నిరసనగా టిడిపి ధర్నా!

జిల్లాలో ఎడాపెడా విధిస్తున్న విద్యుత్ కోతలను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ మహా ధర్నా చేపట్టింది. జూలై 20వ తేది విద్యుత్ భవన్ ఎదుట జరిగిన ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై విరుచుకపడ్డారు. విద్యుత్ కోతలతో అన్ని రంగాలు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సక్రమంగా విద్యుత్ సరఫరా జరగక ప్రజలు, ముఖ్యంగా రైతులు అల్లాడిపోతున్నారన్నారు. రొయ్యల రైతులు దిక్కుతోచక ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి తలెత్తిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న చిన్న పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. ప్రజలు ఇంతగా అవస్థలు పడుతున్నా జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, ఇతర ఎమ్మెల్యేలకు రైతుల సమస్యలు పట్టకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా ఉందని, విద్యుత్ సరఫరాను ఇష్టానుసారంగా అమలు చేస్తున్నారని కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు విమర్శించారు. విద్యుత్ సక్రమంగా అందించకుండా రైతుల నుంచి సర్‌ఛార్జీలు, అదనపు లోడ్ పేరుతో యూనిట్‌కు మూడు రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దుయ్యబట్టారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసారత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో తప్ప మిగతా చోట్ల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారన్నారు. గూడూరు శాసన సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన ధర్నాకు అధిక సంఖ్యలో కార్యకర్తలు రావడం, విద్యుత్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకొంది. ఎస్ఇ నందకుమార్ వచ్చి కోతలు తగ్గిస్తానని హామీ ఇవ్వడంతో తెలుగుదేశం కార్యకర్తలు వెనుదిరిగి వచ్చారు.

● డైరీ కార్మికులకు

మంచిచేసిన కొండ్రెడ్డి!

వంద మందిని రెగ్యులరైజ్ చేశాడు

విజయా డైరీలో పనిచేసే వంద మంది కంటిన్‌జెంట్ వర్కర్ల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని 20వ తేది జరిగిన డైరీ పాలకవర్గ సమావేశంలో తీర్మానించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈ వంద మంది సంవత్సరానికి 33 మంది చొప్పున 2014 సంవత్సరానికల్లా అందరినీ రెగ్యులరైజ్ చేయను ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఒప్పుకొన్నందుకు ఎపి డైరీ మజ్దూర్ సంఘ్ జనరల్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

● ముదిరాజ్ ల

సమస్యలు పరిష్కరించాలి!

బోగోలులో రఘురామ్ ముదిరాజ్ డిమాండ్

ముదిరాజ్ కులస్తులను ప్రభుత్వం బిసి-డి నుండి బిసి-ఏగా మార్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రఘురామ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. బోగోలులో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎంతో వెనుకబడి వున్నారన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి స్థితిగతుల్లో మార్పురాలేదన్నారు. జిల్లాలో రెండు లక్షల జనాభా కల్గివున్న ముదిరాజ్‌లకు ప్రభుత్వ సహకారం అందడం లేదని విమర్శించారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయన దృష్టికి ఈ సమస్యను తీసుకపోగా ముదిరాజ్‌లను బిసి-డి నుంచి బిసి-ఏ కేటగిరి క్రిందకు మార్చడానికి అంగీకరించారన్నారు. ఆయన అకాల మరణంతో సమస్య మొదటికొచ్చిందన్నారు. ఇప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొనిపోయినా పట్టించుకోలేదన్నారు. దీంతో ముదిరాజ్‌లు ఆర్థికంగా చితికిపోయి వారి పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం బిసి కమిషన్‌ను వేసి నివేదిక ఇవ్వాలని, బిసి ఏ కేటగిరి క్రిందకు మార్చాలని, వీరి కోసం సహకార సంస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో ముదిరాజ్ సంఘు నేతలు వెంకటనారాయణ, కెసిఎల్‌రావు, యల్లయ్య, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● పేలవంగా

విద్యా పక్షోత్సవాలు!

విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పక్షోత్సవాలు తూతూ మంత్రంగా జరగడంతో ఈ కార్యక్రమ ఉద్దేశం నెరవేరకుండాపోయింది. అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో బడిబయట వుండే పిల్లలను బడిలో చేర్పించేందుకు రూపొందిన ఈ పక్షోత్సవాలకు ప్రయోజనం లేకుండా పోయిందనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి. తోటపల్లిగూడూరు మండలంలో జరిగిన ఈ కార్యక్రమం పేలవంగా ముగిసింది. బడిబయట పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించినట్లు అధికారులు గణాంకాలు చెప్తున్నా వాస్తవానికి ఇది చాలా దూరంగా వుంది. తల్లులతో నిర్వహించిన సమావేశాలు నామమాత్రంగా సాగాయి. దళితవాడ, గిరిజన కాలనీల్లో జరపాల్సిన గ్రామసభలకు ప్రచారం లేదు. స్పెషలాఫీసర్ రవిచంద్ర ప్రసాద్ ప్రత్యేక దృష్టి పెట్టినా, ఎమ్మార్వోలకు ఉపాధ్యాయులతో సత్సంబంధాలు లేకపోవడం, ఇన్‌చార్జి ఎంఇఓ కొత్త వారవడం, సరిగా కార్యక్రమాన్ని అమలు జరపలేకపోవడంతో మండలంలో విద్యాపక్షోత్సవాలు పేలవంగా ముగిశాయి.

జాతీయస్థాయి పాటల పోటీలు!

కావలిలో విజయవంతంగా నిర్వహిస్తున్న బామా

బాలసుబ్రహ్మణ్యం ఆర్ట్స్‌అండ్ మ్యూజిక్ అకాడమి (బామా) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16న కావలిలో జాతీయస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలను జరుపుతున్నారు. బామా 9వ వార్షికోత్సవ సందర్భంగా పాడనా తెలుగు పాట పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎల్.సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజర్ జలదంకి ప్రభాకర్‌లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన ఒక పాటను, మరొకటి సంగీత ప్రధానమైన దానిని ఎన్నుకొని వాయిద్య సహకారం లేకుండా పాడి సిడి లేదా క్యాసెట్‌ను ఆగస్టు 1వ తేదీలోగా ఎల్.సుధాకర్‌రెడ్డి, బామా కార్యదర్శి, 10-32-8 హెచ్, సొసైటీ కాలని, కావలి-1. అనే చిరునామాకు పంపించాలని కోరారు. విజేతలైన వారికి ప్రథమ బహుమతిగా 25,000, ద్వితీయ బహుమతిగా 15,000, తృతీయ బహుమతిగా 10,000 రూపాయలను అందజేస్తామన్నారు. అలాగే పోటీలో పాల్గొన్న గాయనీ గాయకులందరికి 3వేల రూపాయల నగదు, జ్ఞాపికను అందజేస్తామన్నారు.

● కాంగ్రెస్‌తో

మ్యాచ్‌ఫిక్సింగ్స్ లేవు!



రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, వైకాపా జిల్లా కన్వీనర్ కాకాని గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రణబ్ ముఖర్జీకి ఓటు వేసినంత మాత్రాన కాంగ్రెస్‌తో కుమ్మక్కైనట్లు కాదన్నారు. టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఇలాంటి ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. మనుబోలు మండలం గురివింద పూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నేతలు పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా కాకాని విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చెప్పేవన్ని అబద్ధాలన్నారు. మొదట చంద్రబాబే ప్రణబ్‌కు ఓటు వేయాలని తీర్మానించి తర్వాత మాట తప్పారని విమర్శించారు. ప్రణబ్ ముఖర్జీయే తాను కాంగ్రెస్‌వాడిని కాదని చెప్పాడని, శివసేన, కమ్యూనిస్ట్ పార్టీలు మద్దతిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ గ్రామానికి చెందిన టిడిపి నేతలు సుధీర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, స్వామీజి, ఇబ్రహీం, ఏడుకొండలు వైకాపాలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేతలు జయరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ముత్తుకూరు మత్స్యకారుల ఆందోళన!

ఇచ్చిన హామీలు నెరవేర్చని పోర్టు నిర్వాహకులు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముత్తుకూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట మత్స్యకారులు చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక దశలో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోర్టు ఏర్పడిన నాటి నుంచి మత్స్యకారులు పలు సందర్భాలలో ఆందోళన చేపట్టారు. ఉపాధి కల్పించాలని, ఉద్యోగావకాశాలకై తిరిగి మరోసారి మత్స్యకారులు ఆందోళన బాటపట్టారు. పోర్టు కోసం భూమి కోల్పోయిన నాలుగు గ్రామాల ప్రజలు ఈ ధర్నాలో పాలుపంచుకొన్నారు. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని, ఉపాధి కోల్పోయిన వారికి ఉపాధి చూపించాలని, పోర్టులో ఉద్యోగావకాశాలు కల్పించాలని, ప్యాకేజి అందించాలని ఈ సందర్భంగా మత్స్యకారులు డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పలువురిని అరెస్టు చేసి తోటపల్లి గూడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమాచారాన్ని అందుకొన్న ఆర్‌డిఓ మాధవీలత అక్కడకు చేరుకొని మత్స్యకారులతో చర్చించారు. వారు వేట చేసుకొనేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చేస్తామని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్యాకేజి విషయమై మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొనిపోతామనడంతో మత్స్యకారులు ఆందోళన విరమించారు.

కేంద్రీయ విద్యాలయం రాకుండా చూస్తున్నారు!

అభివృద్ధి పనులు, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు అధికార కాంగ్రెస్‌పార్టీ నాయకులు అడ్డుతగులుతున్నారని కావలి శాసన సభ్యుడు బీద మస్తాన్‌రావు విమర్శించారు. కావలిలో వివిధ సమస్యలపై ప్రజలు ఆయన్ను కలుసుకొన్న సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కోసం ఏ పనికి పూనుకొన్నా అధికారం చేతిలో వుందని అడ్డుకోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటుగా మారిందన్నారు. కావలిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై ప్రస్తావించగా ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. రెండేళ్ల క్రిందటే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అనుమతి లభించిందన్నారు. సర్వాయపాళెం సమీపంలోని బైపాస్‌రోడ్డులో విద్యాలయానికి స్థలం కేటాయించామన్నారు. అయితే కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం తమదంటూ అధికారులను బెదరించి దీనిని అడ్డుకుంటున్నారన్నారు. త్వరలో పట్టణంలో భవనాన్ని ఏర్పాటుచేసి కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభింపజేస్తామని ప్రకటించారు. ఇది కార్యరూపం దాలుస్తుందో లేదో చూడాలి?





వెంకటగిరిలో ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను సన్మానిస్తున్న లబ్ధిదారులు.



పదవీ విరమణ చేసిన నెల్లూరు వేణుగోపాలస్వామి డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ చిల్లకూరు మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న కరస్పాండెంట్ వివేకానందరెడ్డి, కాలేజి లెక్చరర్లు.



హైదరాబాద్ సుందరయ్య కళా నిలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నెల్లూరీయుడు వాస్తు, జ్యోతిష, సంఖ్యా శాస్త్రవేత్త, శబ్దతరంగ జ్యోతిష రూపకర్త నల్లబోతుల ప్రసాదనాయుడును "జ్యోతిషరత్న" బిరుదుతో సత్కరిస్తున్న దూరదర్శన్ న్యూస్ రీడర్ శాంతి స్వరూప్.



నెల్లూరు పొదలకూరురోడ్డులోని క్యాన్సర్ హాస్పిటల్‌లో సర్జికల్ బ్లాక్ నిర్మాణానికి మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున 15 లక్షల రూపాయల విరాళాన్ని హాస్పిటల్ కన్వీనర్ తుంగా శివప్రసాద్‌రెడ్డికి అందిస్తున్న శాంతిలాల్‌జైన్, చంపాలాల్‌జైన్, జెవి.జైన్, వినోద్‌జైన్.

అధికారులపై చిటపట!

ప్రజాసమస్యలు పరిష్కరించాలన్న కురుగొండ్ల



కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొంటున్న వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ.

ప్రజలు సమస్యలతో సతమతం అవుతుంటే అధికారులు పట్టించుకోకుండా మొద్దునిద్ర పోతున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విమర్శించారు. పేరుకు ప్రత్యేకాధికారులని, వారి పాలనలో గ్రామాలు మరింత అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. కలువాయి వచ్చిన ఆయన ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయితీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసిన ఆయన వాటి పరిష్కారానికి ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడం పట్ల ఆగ్రహించారు. పంచాయితీల్లో త్రాగునీటి సమస్య ఎక్కువగా వుందన్నారు. నిధుల కొరత ఒకవైపు, అధికారుల అలసత్వం మరొకవైపు ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోవడానికి కారణమవుతున్నాయన్నారు. చివరకు బోర్ల మరమ్మత్తులకు మెటీరియల్ లేకపోవడం సిగ్గు చేటన్నారు. నాలుగు పంచాయితీలకు ఒక ప్రత్యేకాధికారిని నియమించడం వల్ల అభివృద్ధి జరగకపోగా వున్న సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆగ్రహించారు. పేదలకు అందాల్సిన భూములను కొందరు ధనవంతులు బినామీ పేర్లతో స్వాధీనం చేసుకొన్నట్లు ఆరోపించారు. ఆరో విడత భూపంపిణీలో ఇలాంటి అవకతవకలు, అక్రమాలకు తావు లేకుండా కట్టుదిట్టంగా పంపిణీ జరిగేలా చర్యలు చేపడుతామన్నారు.

● ప్రభగిరి పట్నం

చక్కెర ఫ్యాక్టరీకి తాళాలు!

కడుపు మండిన రైతులు

గత ఆరు నెలలుగా తమకు రావాల్సిన బకాయిలు అందకపోవడంతో విసిగివేశారిన చెరుకు రైతులు చక్కెర ఫ్యాక్టరీకి తాళాలు వేసిన ఘటన పొదలకూరు మండలం ప్రభగిరిపట్నంలో జరిగింది. ఈ ప్రాంత రైతాంగానికి దాదాపు 2.3కోట్ల రూపాయలు చెల్లించాల్సి వుండగా ఇప్పటివరకు ఒక్క రూపాయి అందలేదు. దీనిపై రైతులు శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ దృష్టికి బకాయిల సమస్యను తీసుకొనిపోయినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. తొలివిడతగా కోటి రూపాయలు ఇస్తామన్న అధికారుల హామీ నెరవేరలేదన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం చర్యలకు నిరసనగా తాళాలు వేసి తమ ఆగ్రహాన్ని తెలియజెప్పారు. ఈ కార్యక్రమంలో భారత్ కిసాన్ సంఘ్ నాయకులు పూండ్ల శ్రీనివాసులరెడ్డి, రైతుసంఘం నాయకులు మాలకొండారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చాముండేశ్వరి ఆలయంలో

పనులకు కోర్టు గ్రీన్ సిగ్నల్!

ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో గల శ్రీ చాముండేశ్వరి ఆలయ నిర్మాణ పనులు జరుపుకోవచ్చని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆలయంలో నిర్మాణ పనులు చేపట్టగా వివాదం రేగడంతో గ్రామంలో రెండు వర్గాలు ఫిర్యాదు చేసుకొన్నారు. ఒక వర్గానికి చెందిన వారు ఈ నిర్మాణ పనులను నిలిపివేయాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, జిల్లా కలెక్టర్ దీనిపై నివేదిక పంపడంతో పనులు తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం తిరిగి ఆలయ పనులు జరుపుకోవచ్చని జస్టిస్ చంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆలయ ధర్మకర్తల మండలి హర్షం వ్యక్తం చేసింది.

భక్తుల్లో ఆనందం

రజక సొసైటీలకు నిధులివ్వండి!

అధ్యక్షుడు ఆశయ్య డిమాండ్

జిల్లాలోని ప్రతి రజక సొసైటీకి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఇటీవల నెల్లూరు డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నో పోరాటాలు చేసి 57 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించుకోగలిగామన్నారు. అయితే దీనిని అమలు చేయడంలో బ్యాంకులకు లింకుపెట్టడంతో రుణాలు అందజేయడంలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దోబీ ఘాట్ల నిర్మాణాలకు క్రిందిస్థాయి అధికారులు సహకరించడం లేదన్నారు. ఈ నిర్మాణాలకు 10శాతం డిపాజిట్ పద్ధతి అమలు చేయకుండా రజకులకు తోడ్పాటునందించాలన్నారు. నెల్లూరు, కావలి, కోవూరు, బుచ్చి, నాయుడుపేట కేంద్రాలలోగల ల్యాండ్రివర్గర్లకు బొగ్గు డిపోలు ఏర్పాటు చేయాలని, 36 మండలాల్లో దోబీ ఘాట్‌లకు స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య, యువి.రమణయ్య, తిరుపతి పెంచలయ్య, వెంకటయ్య, కళత్తూరు వెంకటరమణయ్య, మనోరమ, పద్మమ్మ, హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటగిరిలో

నిరుపయోగంగా జంతువధశాల!

వెంకటగిరి పట్టణంలో మునిసిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం నిరుపయోగంగా మారిన జంతు వధశాల. లక్షలాది రూపాయలు వెచ్చించి దీనిని నిర్మించినప్పటికి ఉపయోగించకపోవడంతో ప్రజాధనం వృధాకావడంతోపాటు ఎక్కడపడితే అక్కడ జంతువులను వధిస్తుండడంతో పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. పొట్టేళ్లు, కోళ్ల మాంసం విక్రయించే వారు రోడ్డుపై వాటిని వధించి అమ్మకాలు జరపకుండా వుండేందుకుగాను ప్రత్యేకంగా అన్ని సౌకర్యాలతో ఈ జంతు వధశాలను ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీ అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది. మాంసం విక్రయదారులు ఎక్కడంటే అక్కడ పొట్టేళ్లు, కోళ్లను వధించి అమ్ముతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. మాంసం వ్యర్థాలను రోడ్డుపైనే వేస్తుండడంతో అవి కుళ్ళి అంటువ్యాధులకు కారణమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతోపాటు పట్టణంలో గల పాత కూరగాయల మార్కెట్ బాగోగులు పట్టించుకోకపోవడంతో అది శిథిలమై చుట్టూ ముళ్ల పొదలు, చెట్లు పెరిగి రూపురేఖలు కోల్పోయింది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించి వాటిని చక్కదిద్దాల్సి వుంది.

చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు

ప్రభుత్వ స్కూళ్లే బెస్ట్!



● కోవూరు ఎమ్మెల్యే ప్రశంస

ప్రభుత్వ స్కూళ్లలోనే చక్కని విద్యాబోధన జరుగుతున్నదని కోవూరు శాసనసభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ప్రశంసించారు. వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ స్కూళ్ల కంటే ఇవి మిన్నగా వున్నాయన్నారు. విద్యాపక్షోత్సవాల్లో భాగంగా ఇందుకూరుపేట మండలం గంగపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇది తనకెంతో సంతోషం కల్గించిందని, మరింతగా విద్యా బోధన చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని, దీనికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలలోనే కాకుండా ఎమ్మెల్యేలు, ఎమ్పీలు కావాలని అనడంతో సభలో నవ్వులు పండాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యాశాఖ అధికారులు ఈ విద్యా పక్షోత్సవాల్లో చురుకుగా పాల్గొనాల్సి వున్నా ప్రజాప్రతినిధులకు వున్న శ్రద్ధ వారికి లేకపోవడంపై విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

ఉదయగిరిలో ఇందిరమ్మ ఇళ్లే లబ్దిదారులకు తిప్పలు!

ఉదయగిరి మండలంలో ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న ఇందిరమ్మ పక్కాగృహాలు లబ్దిదారులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. ఒకవైపు ఉన్న తాధికారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని క్రిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నా అదెక్కడా అమలు కావడం లేదు. బిల్లుల కోసం లబ్దిదారులు చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గృహ నిర్మాణ శాఖ అధికారులు సక్రమంగా రాకపోవడం, కార్యాలయం మధ్యాహ్నం అయినా తెర చుకోకపోతుండడంతో పనులు మానుకొని వీరి రాక కోసం ఎదురు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు లబ్దిదారులు. ఇక సిమెంటు, బిల్లులయితే చేయి తడపందే మంజూరు కావడం లేదట. సిబ్బంది అడిగినంత ముట్టజెపితే క్షణాల మీద పని చేసి పెడుతున్నారని, కాదంటే ఏదో ఒక సాకు చూపించి నెలల తరబడి తిప్పుకొంటున్నారని వాపోతున్నారు పేదలు. దీనికి తోడు దళారులు ఇళ్ల నిర్మాణాలు, స్థలాలు ఇప్పిస్తామని చెప్పి లబ్దిదారుల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడుతుండడంతో పేదలు అటు అధికారులు, ఇటు దళారుల నడుమ నలిగిపోతున్నారు.

పని చేయని గృహనిర్మాణ శాఖ

ఉపాధ్యాయుడి వితరణ

కావలి రూరల్ మండలం ఒట్టూరు పాఠశాల ఉపాధ్యాయుడు తల్లపనేని సుధాకర్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. వున్నదానిలో చేతనైన సహాయం చేస్తుండడం ఆయన సేవా గుణానికి నిదర్శనం. సొంతనిధులు 20వేల రూపాయలు వెచ్చించి క్రీడాకారులకు దుస్తులు, సామగ్రిని అందించాడు. తండ్రి శ్రీరాములు జ్ఞాపకార్థం సుధాకర్ ప్రతి ఏడాది పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తుండడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

చిల్లకూరు సుధీర్‌రెడ్డిపై ధ్వజం!

ఆదాల అనుచరుల దూకుడు

సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని విమర్శించే స్థాయి, అర్హత వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేత, విజయ డైరీ మాజీ ఛైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డికి లేదని, ఆయన అవాకులు చవాకులు పేలితే సహించబోమని ముత్తుకూరు మండల కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. ఇటీవల సుధీర్‌రెడ్డి ఆదాలపై విమర్శలు చేసిన నేపథ్యంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎదురుదాడి చేశారు. ఆర్‌అండ్‌బి బంగ్లాలో జరిగిన ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ నేత ఈదూరు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చలువతో విజయాడైరీ ఛైర్మన్ పదవి దక్కించుకొన్న వ్యక్తి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అండదండలతో కోట్లు గడించి చివరకు విజయడైరీ డైరెక్టర్ల వ్యతిరేకతతో పదవి పొగొట్టుకొన్నాడని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి తన స్థాయి మరచి ప్రభాకర్‌రెడ్డిని విమర్శించడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తోటపల్లి గూడూరు మండల ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు కాటం రెడ్డి వసంతకుమార్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, ముత్యాలగౌడ్, శీనయ్య, సుబ్బరాయులు తదితరులు పాల్గొన్నారు.

● పంటల

బీమాను సద్వినియోగం చేసుకోండి!

రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోగోలు మండల వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి కోరారు. బీమాపై ఆయన మాట్లాడుతూ తుపాన్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలు నష్టపోతే ఆ నష్టాన్ని ఈ బీమా పథకం ద్వారా కొంతమేర పూడ్చుకోవచ్చన్నారు. రైతులు బీమా ప్రీమియంను చెల్లించేందుకు వీలుగా వ్యవసాయశాఖ దీనిని నిర్ణయించిందన్నారు. బ్యాంకులు తప్పని సరిగా ప్రీమియం కట్టించుకొనే విధంగా ఆదేశాలు జారీ చేశారన్నారు. వ్యవసాయ రుణాలకు దీనికి సంబంధం లేదని, రుణం పొందని రైతులూ బీమా పథకాన్ని పొందవచ్చన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోవద్దని రైతులకు సూచించారు. మండలంలోని ప్రతి రైతు పంటలకు బీమా చేయించి ప్రభుత్వ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు.

బోగోలు వ్యవసాయాధికారి

స్థలం కన్పించిందా...

అయితే వేసేయ్ పాగా!

వెంకటగిరి పట్టణంలో ఆక్రమణలు జోరందుకొంటున్నాయి. ఆ స్థలం, ఈ స్థలం అన్న తేడా లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలు, చెరువులను సైతం ఆక్రమించుకొంటున్నారు. వెంకటగిరి సమీపంలో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో భూముల ధరలు పెరిగిపోయాయి. దీంతో స్థలాలను ఆక్రమించుకొని అమ్మకాలు సాగించి లక్షలార్జిస్తున్నారు ఆక్రమణదారులు. అధికమవుతున్న ఆక్రమణలపై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందించక పోవడంతో ఆక్రమణదారుల చర్యలకు అడ్డుఆపు లేకుండా పోయింది. పలు చెరువులు ఆక్రమణ చెర చిక్కుతుండడంతో ఆయాప్రాంతాల ప్రజలు నిస్సహాయస్థితిలో వుండిపోతున్నారు. పట్టణ నడిబొడ్డున వున్న చెవిరెడ్డిపల్లి, అమ్మవారిపేట చెరువులు ఆక్రమణకు గురౌతున్నాయి. ఈ చెరువుల క్రింద వున్న మాగాణి భూమి ఒక్కో ఎకరా 70లక్షల నుంచి కోటి రూపాయల వరకు ధర పలుకుతుండడంతో సమీపంలో నివసించేవారు మెల్లమెల్లగా చెరువులను తమ హస్తగతం చేసుకొంటున్నారు. పట్టణానికి సమీపంలో వుండే అక్బర్ నివాస కండ్రిగలో నీటిగుంటను ఆక్రమణదారులు తమ గుప్పెట్లో పెట్టుకోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ ఆక్రమణదారులకు కొందరు అధికారులు అండదండలు అందిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంకటగిరిలో నానాటికి పెరిగిపోతున్న ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజలు కోరుకొంటున్నారు.

వెంకటగిరిలో అక్రమార్కుల విజృంభణ

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

బ్రాహ్మణ
వివాహ సంబంధాలకు
: సంప్రదించండి :
Ph : 0861 - 6527494
email : svsmarriagelinks@live.com

● వ్యక్తిత్వ వైశిష్ట్యమే...

ప్రణబ్‌ముఖర్జీని రాష్ట్రపతి చేసింది!



నూతన రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ పట్టాభిషక్తుడయ్యాడు. పశ్చిమబెంగాల్‌లోని మారు మూల పల్లెటూరు మిరాటి నుంచి రైసినాహిల్స్‌లోని రాజప్రసాదానికి జరిగిన సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో మైలు రాళ్లు దాటారాయన.

ప్రణబ్ ముఖర్జీ ఫక్తు పల్లెటూరు పెద్ద మనిషి. ప్రణబ్ పసితనమంతా పల్లెటూరులోనే గడిచింది. అందువల్లనే ఆయనలో గ్రామీణ వాసనలు ఇప్పటికీ మిగిలే వున్నాయి. చిన్నతనంలో చదువంటే సరిపడేది కాదట. బడికి వెళ్లనని మారాం చేయడంతో తరచూ తల్లి తండ్రుల చేత తన్నులు తినేవాడట. ఆ బడి కూడా వూరికి దూరం. మధ్యలో గంగానది పాయ వుండేది. వర్షాకాలంలో దాన్ని దాటడానికి వంతెన లేకపోవడంతో, పుస్తకాలను తల మీద పెట్టుకొని, తలగుడ్డతో గట్టిగా కట్టి, ఈదుకొంటూ వెళ్లాల్సి వచ్చేదట. లాల్‌బహదూర్ శాస్త్రి కూడా ఇట్లా గంగను ఈది చదువుకొన్నవాడు కావడం గమనార్హం. ఆయన జాతిని చైతన్య పరచిన ప్రధానిగా చరిత్రలో నిలిచిపోయాడు. ఈయన జాతికి గౌరవం తెచ్చిన మంత్రిగా గుర్తింపు పొందాడు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం!

ప్రణబ్ తండ్రి గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు. బ్రిటీష్ ప్రభుత్వం ఆయన్ను పన్నెండేళ్ల పాటు జైలులో పెట్టిందంటే, ఆయన సమరశీలత్వం ఎట్లా వుండేదో అర్థం చేసుకోవచ్చు. ఆ ప్రభావం ప్రణబ్ మీద చాలానే వుంది. అందువల్లనే చరిత్ర, రాజనీతి శాస్త్రాలలో రెండు పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీలు, అదనంగా న్యాయశాస్త్ర పట్టా పొంది కూడా ఉద్యోగాలతో సరిపెట్టుకోకుండా రాజకీయ రంగ ప్రవేశం చేశాడు. చాలా కొద్దికాలం మాత్రం 24 పరగణాల జిల్లాలోని ఒక కాలేజీలో అధ్యాపకుడిగా పని చేశాడు.

ఇందిరమ్మకు సన్నిహితుడు

1969లో అప్పటి కాంగ్రెస్ అగ్రనేత కృష్ణ మీనన్ పశ్చిమబెంగాల్‌లోని మిడ్నాపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. ఆ ఎన్నికల ప్రచార అవకాశం ప్రణబ్‌కు దక్కింది. ఆ ప్రచార నిర్వహణలో ఆయనలోని ప్రతిభను గుర్తించింది ఇందిరమ్మ. రాజ్యసభ సభ్యత్వం బహూకరించింది. నాలుగేళ్లలోనే ఆయన్ను తన మంత్రివర్గంలో చేర్చుకొన్నది. అప్పటి నుంచి ఆయన ఇందిరమ్మ కుటుంబానికి అత్యంత సన్నిహితుడై పోయాడు. ఇందిరా గాంధీకి పొగ త్రాగేవారంటే సరిపడదు. కానీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ప్రణబ్ కోసం పైప్, అందులోకి పొగాకు కొని తెచ్చి, బహూమతిగా ఇచ్చేవారట ఆమె. ఆయనంటే ఆమెకెంత అభిమానమో దాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. 1982లో ఆయన్ను ఆర్థిక మంత్రిగా నియమించినప్పుడు అందరూ తప్పు పట్టారు. 40 ఏళ్ల కూడా లేని కుర్రవాడికి దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వహించే పాటవం ఎట్లా వస్తుందని అనుమానించారు. కానీ ఆ ఏడాది 'యూరో మనీ' అనే పత్రిక ఆయన్ను ప్రపంచంలోని అత్యంత ప్రతిభావంతుడైన ఆర్థికమంత్రిగా ప్రకటించింది. ప్రణబ్‌లో దాగి వున్న ప్రజ్ఞకు అదొక నిదర్శనం.



రాష్ట్రపతి భవన్

రాజీవ్‌పై అలిగాడు!

అయితే రాజీవ్‌గాంధీ ఆయన్ను విశ్వాసంలోకి తీసుకోలేదు. ఇందిరాగాంధీ హత్య జరిగిన సమయంలో వీరిద్దరూ కలకత్తాలో వున్నారు. ఇద్దరూ కలిసి ఒకే విమానంలో ఢిల్లీకి ప్రయాణించారు. ఆ సమయంలో ఇందిర తర్వాత ప్రధాని కాగల అర్హత తనకే వుందన్న భావనను వ్యక్తం చేశాడట ప్రణబ్. అది రాజీవ్‌గాంధీ మనస్సులో అట్లనే నిలిచిపోయింది. దానితో 1985లో ఎన్నికల తర్వాత ప్రణబ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాడు రాజీవ్. అందుకు అలిగిన ప్రణబ్, 'రాష్ట్రీయ సమాజ్‌వాదీ కాంగ్రెస్' అనే స్వంత పార్టీ పెట్టుకొన్నాడు. కానీ తన స్వంత రాష్ట్రంలో ఒక్క గ్రామ పంచాయితీని కూడా గెలిపించుకోలేక పోయాడు. ప్రణబ్ రాజకీయ మేధావి, అపర చాణక్యుడే కానీ, ప్రజలతో ఆయనకు సంబంధాలు తక్కువ. వారి మనసులు గెలుచుకొనే విద్య ఆయనకు వంటబట్టలేదు. అందువల్లనే 2004లో సిపిఎం సహకారం దొరికే వరకు ఆయన ప్రత్యక్ష ఎన్నికలలో విజయం సాధించలేదు. స్వంత పార్టీ దండగ అని తేలిపోవడంతో రాజీవ్ గాంధీ శరణు చొచ్చాడు. అయితే రాజీవ్ ఆయన్ను పార్టీలోకి తిరిగి తీసుకొన్నాడు తప్ప, ఏ పదవీ ఇవ్వలేదు.

పివితో వెలుగులోకి వచ్చాడు!

1992లో పివి నరసింహారావు వచ్చిన తర్వాత మాత్రమే ప్రణబ్‌కు రాజకీయ ప్రవాసం నుంచి విముక్తి కల్గింది. ఆయన్ను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించాడు. ఆ తర్వాత మంత్రివర్గంలోకి తీసుకొని విదేశీ వ్యవహారాల శాఖ అప్ప చెప్పాడు. పివి తర్వాత సోనియాగాంధీకి దగ్గరయ్యాడు. ఆమెను ప్రత్యక్ష రాజకీయాలలోకి తీసుక వచ్చిన ప్రముఖులలో ప్రణబ్ ఒకడు. అయితే 2004లో ప్రధాని పదవికి అభ్యర్థి ఎవరు అన్న ప్రశ్న వచ్చినప్పుడు సోనియాగాంధీ మన్మోహన్ సింగ్‌ను తెరపైకి తెచ్చిందే తప్ప, ప్రణబ్‌కు అవకాశం ఇవ్వలేదు. ప్రణబ్‌కు, మన్మోహన్‌కు వున్న తేడా రాజకీయ ఆకాంక్ష. మన్మోహన్ బుద్ధిమంతుడైన విద్యార్థి వంటివాడు. టీచర్ చెప్పిన పనల్లా చేసే తత్వం. కానీ ప్రణబ్‌లో ఎదగాలనే కోరిక బలీయం. ఈ తేడాను సోనియాగాంధీ బాగా గమనించింది. ప్రధానిత్వం రాలేదనే అసంతృప్తి వున్నప్పటికీ, ఒకసారి పార్టీ నుంచి బయటకు వెళ్లిన చేదు అనుభవం వుంది కాబట్టి, సోనియాగాంధీ ఇచ్చిన రక్షణ మంత్రిత్వంతోనే సరిపెట్టుకొన్నాడు. అయితే ఆయనకు ఆర్థిక మంత్రిత్వం మీదనే ఎక్కువ మోజు. సోనియాగాంధీకి నచ్చ చెప్పి ఆ కోరిక తీర్చుకోవడానికి చాలాకాలం పట్టిందాయనకు.

1982లో మన్మోహన్‌సింగ్‌ను రిజర్వు బ్యాంక్ గవర్నర్‌గా నియమించింది ప్రణబ్ ముఖర్జీ. తన క్రింద పని చేసిన సాధారణ అధికారి క్రింద తాను మంత్రిగా పని చేయవలసి రావడం ఎవరికైనా కష్టమే. కానీ ఆ అసంతృప్తి ఎప్పుడూ బయటపెట్టలేదు ప్రణబ్. మన్మోహన్‌సింగ్‌కు అన్ని విధాలా సహకరించాడు. ప్రణబ్‌లోని గొప్ప గుణం – స్వచ్ఛమైన వ్యక్తిత్వం. దాదాపు 45 సంవత్సరాల పాటు ఢిల్లీ రాజ దర్బారులో కీలక పాత్ర పోషించినా ఒకరు వేలెత్తి చూపే తప్పు ఎప్పుడూ చేయలేదు. నీతికి, నిజాయితీకి జీవితకాలం కట్టుబడి వుండగలగడం మాటలు చెప్పినంత సులభం కాదు. ఆ వ్యక్తిత్వ వైశిష్ట్యమే ప్రణబ్‌కు ప్రజా జీవితంలో అంత ఉన్నత స్థాయిని సంతరించి పెట్టింది.



నెల్లూరులో ప్రముఖ ఆడిటర్ టి.వి.వసంతకుమార్‌రెడ్డి కుమార్తె లక్ష్మీ లావణ్య, నరేంద్రకుమార్ రెడ్డిల వివాహం జూలై 21తేది మినీబైపాసురోడ్డులోని ఎం.ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జరిగింది.

స్వగ్రామంపై మమకారం!

దేశానికి రాజైనా తల్లికి కొడుకే అన్నట్లు, ఎంత పెద్ద పదవిలో వున్నా, ఎన్ని వూపిరి సలపని పనులున్నా స్వంత గ్రామాన్ని మాత్రం ఏరోజు మరవలేదు ప్రణబ్. మిరాటి గ్రామంలో వారిది అర్చక కుటుంబం. ఆ సాంప్రదాయాన్ని ఇప్పటికీ పాటిస్తాడాయన. దసరా సమయంలో జరిగే దుర్గ పూజలో నాలుగు రోజులపాటు తమ వూరి గుడిలో పూజారిగా వ్యవహరించడం ఆయనకు ఆనవాయితీ. ఒక్క సంవత్సరం కూడా ఈ సాంప్రదాయానికి విరామం ఇవ్వలేదు.




నూతన రాష్ట్రపతిగా పట్టాభిషక్తుడైన ప్రణబ్ ముఖర్జీ కోసం కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన కొత్త మెర్సిడెజ్ బెంజ్ కారు ఇది. దీని విలువ ఆరున్నర కోట్ల రూపాయలట.

ప్రణబ్ ముఖర్జీకి పుస్తకాలంటే ప్రాణం. ఆయన చేతిలో ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం వుంటుంది. రాత్రి కనీసం ఒక గంట పాటైనా పుస్తకం చదవనిదే నిద్రపోడట. ఆఫీసులో ఒక ప్రక్క ఫైళ్లు చూస్తూనే మరొకప్రక్క ఏదో ఒక పుస్తకం చదువుతూ గడుపుతాడు. తన గదిలోకి తతిమా మంత్రుల వలె సందర్శకులను అనుమతించడు. ఖాళీ దొరికితే పుస్తక పఠనమే ఇష్టం ఆయనకు.

రాష్ట్రపతి పదవికి అన్ని అర్హతలూ వున్న పెద్ద

కొరవ 14వ పేజీలో



సకల శుభాల మాసం రంజాన్!

ఎన్నో అనుగ్రహాలు, శుభాలకు సత్కార్యాలకు నెలవైన మాసం రంజాన్ మాసం. ఇస్లామియా క్యాలెండర్‌ననుసరించి వచ్చే నెలల్లో ఒక నెల పేరు ఇది. నెలల క్రమంలో తొమ్మిదవది రంజాన్ మాసం. రంజాన్ నెల ప్రవేశంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిం మతస్తులం దరూ ఉపవాసదీక్ష పాటిస్తారు. ఖురాన్ ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఆచరించవలసిన నియమం ఉపవాసం. దీనిని పారసీ భాషలో 'రోజా' అని, అరబీలో 'సామ్' అని పిలుస్తారు. జీవనభ్రమణంలో పండుగలు ఒక భాగం. అవి ఏ మతానికి సంబంధించినవి అయినప్పటికీ వాటి వెనుక ఒక సందేశం దాగి వుంటుంది. హితాన్ని బోధిస్తుంది. దైవభక్తి, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. మంచి అల వాట్లు అలవరచుకోవడం, చెడు అలవాట్లు విసర్జించడం రంజాన్ ఉప వాస దీక్షల్లో ముఖ్య ఉద్దేశం. ఆహార పానీయాలను మానివేయడం మాత్రమే రోజా కాదు. నియమనిష్టలతో కూడుకున్న జీవన విధానం ఉప వాస దీక్షల్లోని అంతరార్థం.

రంజాన్ ఉపవాస దీక్షలను పాటించేవారు తెల్లవారు జామునే భోజనం చేసి రోజంతా ఉప వాసం వుండి సూర్యాస్తమయం తర్వాత ఉప వాసాన్ని విరమిస్తారు. సూర్యోదయానికి ముందు ఆహారం తీసుకోవడాన్ని 'సహర్' అని, సూర్యా స్తమయం తర్వాత తీసుకొనే ఆహారాన్ని 'ఇఫ్తార్' అని అంటారు. దాదాపు 13 గంటలపాటు వుండే ఉపవాసదీక్షలో పాటించాల్సిన నియమ నిష్టలను ఖురాన్‌లో వివరించబడి వుంది. రోజా ఉండేవాళ్లు పాటించాల్సిన ముఖ్యమైన అం శాలు అబద్ధమాడకూడదు. పరనిందకు పాల్ప డకపోవడం, శారీకర, మానసిక వాంఛలకు దూరంగా, నిగ్రహం పాటిస్తూ దైవచింతనతో గడపాలి. మనిషిలో దైవభీతి, దేవుడిపట్ల నమ్మకం తదితర సుగుణాలను పెంపొందించు కోవడం దీని లక్ష్యం. దీనిని ఖురాన్‌లో 'తఖ్వా' అని అంటారు.

శుభకరమైన రంజాన్ మాసంలోనే దివ్య ఖురాన్ ఆవిర్భవించిందని నమ్ముతారు ముస్లింలు. ఈ మాసంలో రాత్రింబవళ్లు దైవ ప్రార్థన, నమాజులో గడుపుతారు. ప్రతిరోజు ఐదుసార్లు నమాజ్‌చేసే ముస్లిం సోదరులు రాత్రిపూట ప్రత్యేకంగా తరావీ నమాజు చదువు



షుగర్ వ్యాధిగ్రస్తులకు
సంజీవని జెరిటిన్-డి

తారు. సాయం సంధ్యవేళల్లో ఫర్జ్ నమాజ్ తర్వాత ఎక్కువ సమయం దైవప్రార్థనలో గడపడాన్ని ఏతెకాఫ్ (తపోనిష్ట) అని అం టారు. ఇక దివ్యఖురాన్ ఆవిర్భవించిన రోజుగా చెప్పబడే 27వ ఒక్కపొద్దు రోజు రాత్రి జాగారణ చేస్తారు. దీనిని షబ్ – ఏ – ఖదర్ అంటారు. రంజాన్ ఉపవాస దీక్షలలో అత్యంత ముఖ్యమైనది దానధర్మాలు చేయ డం. జకాత్‌గా పిలువబడే దీనిని ఆచరిం చాల్సిందిగా ఖురాన్‌లో పేర్కొనబడింది. పేదల ఆర్థిక హక్కుగా దీనిని భావిస్తారు. గోధుమలను గాని, ఇతర ఆహార పదార్థా లను దానంగా ఇస్తారు. వీటితోపాటు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని ధన రూపం లోనూ పేదలకు పంచిపెట్టాల్సి వుంటుంది. ఆకాశంలో నెలవంక దర్శనమిచ్చిన తర్వాత ఉపవాసదీక్ష విరమించి ముస్లింలు ఒకరి కొకరు ఈద్‌ముబారక్ (శుభాకాంక్షలు) చెప్పు కొంటారు. చక్కని ఆలోచనలకు, ధార్మిక చిం తనకు దైవభీతి, క్రమశిక్షణ, దాతృత్వానికి ఆలవాలమైన మాసంగా రంజాన్ నెల చెప్ప బడుతుంది.

ట్రంకురోడ్డు బాతులు

కలెక్టరేట్‌లో ఘోరాలు!



చట్టం, న్యాయం, ధర్మానికి ప్రతీకగా నిల వాల్సిన కలెక్టరేట్‌లో నేరాలు – ఘోరాలు జరుగుతున్నాయి. నైట్ డ్యూటీలో వుండే అటెండర్లు కలెక్టరేట్‌ను 'నైట్ బార్' చేస్తున్నారు. సాక్షాత్తు కలెక్టరు గారి గది ప్రక్కనే వుండే సిసి గదిలో ఈ మధ్య ఒక రేవ్ పార్టీ జరిగిందట. పుల్‌గా తాగేసిన అటెండర్ అండ్ ఫ్రెండ్స్ బ్యాచ్ అక్కడ వ్యభిచారం కూడా చేశారట. తీవ్ర రక్తస్రావంతో ఆ మహిళ ఆస్పత్రిలో చేరడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఈ గలీజు పని చేసిన అటెండర్ చేతిలో కలెక్టరేట్‌లో జరిగే చీకటి కార్యకలాపాల గుట్టుమట్టులన్నీ వుండడంతో ఇతన్ని ఉద్యోగం నుంచి తొలగించకుండా గూడూరుకు ట్రాన్స్‌ఫర్ చేసి పంపడంపై కలెక్టరేట్‌లో హాట్‌హాట్ చర్చ జరుగుతుంది.

జనాన్ని ఆశీర్వదిస్తున్న వివేకా!




పిచ్చి ముదిరి రోకలి తలకు చుట్టమన్నాడట పూర్వం ఒకతను. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో నెల్లూరు రూరల్, సిటీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ దయనీయమైన స్థితికి చేరినా ఎమ్మెల్యే వివేకానందరెడ్డిలో మార్పు రాలేదు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజేతలకు అభినందనల పేరిట నగరంలో వెలసిన ఫ్లెక్సీలలో వివేకానందరెడ్డి జనానికి నమస్కారం పెట్టే ఫోజు మాని పెద్ద మహానుభావుడు జనాన్ని ఆశీర్వదిస్తున్నట్లు ఫోటోలు ముద్రించారు. ఈ ఫ్లెక్సీల్లో యువశక్తి, జనశక్తి... ఆనం కనకశక్తి అంటూ స్లోగన్లు ముద్రించారు. వీటి మర్మం తెలియక ట్రంకురోడ్డులో జనం రకరకాలుగా మాట్లాడుకొంటున్నారు.

మొగలి పువ్వు @ 15 రూపాయలు



శ్రావణ మాసంలో అతి వలు పూజలు పున స్కారాలు ఎక్కువగా చేస్తారు. కాబట్టి ఫల, పుష్పాల ధరలు కాస్త పెరగడం ఖాయం. విరివిగా లభిస్తున్న మల్లెలు, సెంటు జాజుల రేట్లు మూర పది, పదిహేను రూపాయలకు తొలి శుక్రవారానికే చేరుకొన్నాయి. విచిత్రమేమిటంటే రెండు, మూడు రూపాయల ధర పలుకుతుండిన మొగలి పువ్వు ఒక్కసారిగా 15 రూపాయలైపోయింది. వాసనతో మరులు గొల్పే ఈ అరుదైన పువ్వు ధర విపరీతంగా పెరిగినా మహిళలు మాత్రం కొనడం మానడం లేదు.

జెండావీధిలో దైన్యం



కప్పుడు నెల్లూరు పాతబస్తీ జెండా ఒవీధిలో వీధిలైట్లు పగలూ రాత్రి వెలిగేవి. రోడ్లు గుంటా మిట్టలు లేకుండా వుండేవి. మురికి కాలువను ప్రతిరోజూ శుభ్రం చేసేవారు. సందాని బాష వంటి నేత బతికున్న రోజుల్లో 24 గంటలు మునిసి పల్ కొళాయిల్లో నీళ్లు వచ్చేవి. రంజాన్ నెల మొదలయ్యాక కూడా జెండావీధిలో వీధిలైట్లు వెలగడం లేదు. మసీదుల వద్ద కాస్త బ్లీచింగ్ చల్లి సరిపెడుతున్నారు. పారిశుద్ధ్య పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. కాని మునిసిపల్ అధికార వర్గం మాత్రం రాష్ట్రంలో ఎక్కడా లేనట్లు మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో శుభ్రత.... పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నామంటూ ఊదర గొట్టేస్తున్నారు.

తప్పుడు ఎలక్ట్రానిక్ తూకాలు



పాత రోజుల్లో రాళ్లు పెట్టి తూసే తక్కె డలతో తప్పొప్పులను 'డాలా'తో సరిచేసుకొనేవారు. కిలో గ్రాముల్లో వుండే రాళ్లలో తూకాలు సరిలేవని ఎలక్ట్రానిక్ తక్కె డలు మార్కెట్‌లోనికి వచ్చాయి. కాని వీటిని వినియోగిస్తున్న వ్యాపారులు కొనే సమయం లోనే సాంకేతిక మార్పులు చేయిస్తున్నారు. కిలో తూగాల్సిన వస్తువులు 800 గ్రాములే తూగుతున్నాయి. ఎసి కూరగాయల మార్కెట్, డైకస్‌రోడ్డులోని చేపలు, మాంసం మార్కెట్లతో పాటు నగరంలోని చాలా మంది చిల్లర వ్యాపారులు ఇదే అక్రమ పద్ధతి పాటిస్తున్నారు. తూనికలు కొలతల శాఖ పెద్ద కసరత్తు చేస్తే గాని నగరంలో ఎలక్ట్రానిక్ తప్పుడు తూకాలు ఆగవు.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

వృత్తి, వ్యాపారాలు సామాన్యం, ఆర్థిక లాభాలు తక్కువగా వుంటాయి. ఇంటియందు శుభకార్య ప్రయత్నాలు, బంధువుల కలయిక వుంటాయి. ఉద్యోగులకు పై అధికారుల ఒత్తిడి వుంటుంది. విద్యార్థుల ప్రయత్నాలు విజయవంతమౌతాయి. వ్యవసాయదారులు క్లిష్ట పరిస్థితుల నుండి బయటపడతారు. కళా, క్రీడా రంగాలలోని వారికి అనవసర శ్రమ, ఒత్తిడి వుంటాయి. రాజకీయులకు అననుకూలం.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

అన్ని వర్గాల వారికి పనులలో సామాన్యంగా వుంటుంది. శత్రు విజయం, శరీరారోగ్య లోపం వుంటుంది. కోర్టు వ్యవహారాలలో వాయిదాలు కోరుట మంచిది. విద్యార్థులు నూతనోత్సాహంతో వుంటారు. వ్యవసాయదారులు అనుకూలతలు సాధిస్తారు. కళా, క్రీడా రంగాలలోని వారు పట్టుదలతో పనులు సాధించుకోవాలి. రాజకీయ వర్గాలకు పరోక్షంగా శత్రు విజయం.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్రపునర్వసు,1,2,3 పా

గతంలో ఏర్పడ్డ ఆటంకాలు తొలగి పనులు సానుకూలమవుతాయి. వృత్తి, వ్యాపార, ఉద్యోగులకు సమన్వయం అవసరం. ఇంటియందు శుభకార్య ప్రయత్నాలు చేస్తారు. వ్యవసాయదారులకు ఆర్థిక లోటు లేకపోయినా సర్దుబాటు అవసరం. కళా, క్రీడా రంగాలలోని వారికి ఆశించిన ఫలితాలుంటాయి. అవసరానికి రుణం అందుతుంది. రాజకీయ రంగంలోని వారికి ఆశించిన పనులు నెరవేరుతాయి.




కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

తొందరతో కూడిన పనులు పనికిరావు. ఆదాయ, వ్యయాలు సమానంగా వుంటాయి. ఉద్యోగులకు స్థానమార్పు. వృత్తి, వ్యాపారాలు చేసేవారు రుణాలు చేస్తారు. విద్యార్థులకు అనుకూలం. ఒకవార్త సంతోషాన్నిస్తుంది. కళా, క్రీడా రంగాలలోని వారికి మెళకువ అవసరం. అధిక వ్యయం, శ్రమ, ఒత్తిడి వుంటాయి. రాజకీయులకు ఆర్థిక పరిస్థితి సామాన్యం. పై వర్గాల సూచనలను పాటించడం మంచిది.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ఆర్థికాదాయాలు సామాన్యంగా వుంటాయి. గతంలో వ్యతిరేకులైన వారు అనుకూలురౌతారు. ఇంట్లో భార్యాపిల్లల మధ్య బేధాభిప్రాయాలుంటాయి. శుభవార్త వింటారు. శుభకార్య యత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారులకు ఆదాయం సామాన్యం. ఉద్యోగులకు పై అధికారులతో అనుకూలత అవసరం. కళా, క్రీడాకారులకు అనుకూలం. రాజకీయులు పై వర్గాల అనుకూలతకు ప్రయత్నించాలి.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

పనులలో ఆటంకాలేర్పడతాయి. రుణాలు చేయవలసి రావచ్చు. ఇంటాబయట సమస్యలు, ఆర్థిక ఇబ్బందులుంటాయి. ఉద్యోగులకు పై అధికారుల ఒత్తిడి వుంటుంది. విద్యార్థులు తలచిన పనులు పూర్తి చేస్తారు. వ్యవసాయదారులకు ఆర్థికవృద్ధి వుంటుంది. కళా, క్రీడా రంగాలలోని వారు విమర్శలనెదుర్కొంటారు. చేసే పనులు ఉత్సాహాన్నిస్తాయి. రాజకీయ నాయకులకు పై వర్గాలతో ఇబ్బందులుంటాయి.

వారఫలాలు

తేది 28-07-2012 నుండి 03-08-2012 వరకు వృషభంలో గురు, కేతువులు, 31తేది వరకు శుక్రుడు తదుపరి మిథునంలో; కర్కాటకంలో రవి, బుధులు; కన్యలో కుజ, శనులు; వృశ్చికంలో రాహువు; వృశ్చిక, ధనుర్మకరాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

30తేది దామోదర ద్వాదశి వ్రతం.
2తేది జంధ్యాల పండుగ – శ్రావణ పౌర్ణమి. రాఖీ పండుగ.

శుభ ముహూర్తాలు

3తేది వివాహ శుభకార్యాలకు మరియు సాధారణ శుభకార్యాలకు సుముహూర్తాలున్నాయి.

జూలై తిథులు

శ్రావణ శుద్ధ

28	శని	దశమి	రా	08.44	గం.ల.వ
29	ఆది	ఏకాదశి	సా	06.15	గం.ల.వ
30	సోమ	ద్వాదశి	ప	03.45	గం.ల.వ
31	మంగళ	త్రయోదశి	ప	01.15	గం.ల.వ


ఆగష్టు తిథులు

1	బుధ	చతుర్దశి	ప	10.57	గం.ల.వ
2	గురు	పౌర్ణమి	ప	08.56	గం.ల.వ

శ్రావణ బహుళ

3	శుక్ర	పాడ్యమి	ఉ	07.19	గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

కొన్ని పనులలో కీలక నిర్ణయాలు తీసుకొంటారు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. విదేశీ ప్రయాణాలలో ఫలితాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగులు కొన్ని ఇక్కట్ల నుండి బయటపడతారు. దూర ప్రయాణాలు అనుకూలిస్తాయి. వ్యవసాయదారులకు ఆర్థికపుష్టి వుంటుంది. కళా, క్రీడా రంగాలలోని వారిపై విమర్శలధికమౌతాయి. రాజకీయాలలోని వారికి అనవసర ఖర్చులు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

పనులు నిదానంగా సాగినా క్రమంగా పుంజుకుంటాయి. బంధుమిత్రుల కలయిక వుంటుంది. వృత్తి, వ్యాపార, ఉద్యోగులకు పనులపై శ్రద్ధ అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఆర్థికాదాయం వుంటుంది. విద్యార్థులకు అనుకూలం. కళా, క్రీడా రంగాలలోని వారికి అనవసర ధన వ్యయమున్నా చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యవసాయ పనులు పుంజుకుంటాయి. రాజకీయాలలోని వారికి ధనవ్యయం.




ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇంటాబయట సానుకూలతలుంటాయి. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. బంధుమిత్రుల కలయిక, నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఆర్థికాదాయం, అనుకూలతలుంటాయి. ఉద్యోగులకు సానుకూల బదలీలుంటాయి. కళా, క్రీడా రంగాలలోని వారు తమ వృత్తియందు నిమగ్నం కాగలరు. గృహ, స్థల సేకరణలుంటాయి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

పనులు సానుకూలంగా పూర్తి చేస్తారు. శుభకార్య ప్రయత్నాలు నేరవేరగలవు. బంధుమిత్రుల కలయిక, ఉద్యోగులకు అనుకూల బదలీలు వుంటాయి. వృత్తి, వ్యాపారాలలో ఆర్థికపుష్టి వుంటుంది. విద్యార్థులకు బాగుంటుంది. వ్యవసాయానుకూలత వల్ల ఆర్థికాదాయం పెరుగుతుంది. కళా, క్రీడా రంగాలలోని వారు చిన్న సమస్యలున్నా సమర్థించుకోగలరు. రాజకీయులకు అనుభవజ్ఞుల సలహాలు అవసరం.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

తలపెట్టిన పనులలో ప్రతికూలతలుంటాయి. ముఖ్య విషయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. కోర్టు వ్యవహారాలలో వాయిదాలు కోరుట మంచిది. వృత్తి, వ్యాపారాలలో ఆర్థిక చికాకులుంటాయి. ఉద్యోగులకు ప్రయాణాలు, శరీర శ్రమ అధికం. నూతన వ్యాపారం చేసే వారికి అనుకూలం. వ్యవసాయదారులు ముఖ్యపనులు పూర్తి చేసుకొంటారు. కళా, క్రీడా రంగాల వారు విమర్శలెదుర్కొంటారు.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

అన్ని రంగాల వారికీ ప్రతికూలతలుంటాయి. శరీరారోగ్య లోపం. వృత్తి, వ్యాపార, ఉద్యోగులకు అధిక శ్రమ, ఆదాయం సామాన్యం. విద్యార్థులు శ్రమకు తగ్గ ఫలితం పొందగలరు. కళా, క్రీడా రంగాలలోని వారికి ప్రతికూలతలున్నా పెద్దవారి స్నేహానుకూలతలుంటాయి. వ్యవసాయ రంగంలో ఆర్థిక, సామాన్యతలుంటాయి. రాజకీయాలలోని వారికి ముఖ్య వ్యవహారాలందు తగు జాగ్రత్తలు అవసరం.

భారత జ్యోతిష శాస్త్రానికి పాశ్చాత్యుల కైమోడ్పులు!

మహమ్మద్ షఫి హైదరాబాద్

** భారత జ్యోతిష శాస్త్రంపై ఓ విదేశీయుడు ఈ మధ్య ఓ ఆంగ్ల పత్రికలో రాద్ధాంతం చేశాడు – మీకు తెలుసా?*

అమెరికా 'వాల్‌స్ట్రీట్'లో కందుకూరు జాన్సన్ అలా వ్రాసినట్లు 'కాలిఫోర్నియా' మిత్రుడి ద్వారా విన్నాను. పాశ్చాత్య శాస్త్రవేత్తలైన లార్డ్‌బెకన్, కెప్లర్, డ్రైడన్ భారత జ్యోతిష శాస్త్రాన్ని వారి గ్రంథాలలో శ్లాఘించినట్లు అతనికి తెలియదు. అతని మత ఛాందస వాదాన్ని పట్టించుకోకపోవడమే మేలు!

ఎన్.పరమేశ్వర్ హైదర్‌గూడ

** గృహ నిర్మాణం మొదలు పెట్టినప్పటి నుంచి ఎవరికో ఒకరికి దెబ్బలు తగులుతూనే వున్నాయి.*

స్థలానికి 'శక్తివేధ' వున్నప్పుడు ఇలా జరుగుతుంది. 'హనుమాన్ యంత్ర' ప్రతిష్ఠ చేసి పనిని ప్రారంభించండి.

జె.వి.అరవింద అగ్రహారం

** ఊరిబయట ధైర్యం చేసి గృహ నిర్మాణం చేశాను. ఆమె మానసిక పరిస్థితి బాగోలేదు.*

'శక్తి ఆవాహన' జరిగి వుండవచ్చు. సుదర్శన యంత్ర ప్రతిష్ఠ చేసి, ఆమెనొకమారు సైకియాట్రిస్టుకు చూపించండి.

వి.నిర్మలానందశాస్త్రి నెల్లూరు

** వాస్తు శాస్త్రం ఏఏ గదులు, ఏఏ 'ఆయా'ల ప్రకారం నిర్మాణం కావాలని చెబుతున్నది?*

ద్వాదశాష్ట వాస్తు శాస్త్రాలలో గదుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. బాత్రూం ధ్వజాయం, బెడ్‌రూం దక్షిణం సింహాయం, డైనింగ్ పశ్చిమం వృషభాయం, వాయువ్యం పశుశాల ఖరాయం, పూజాగది ఈశాన్యం కాకాయం.

ఎన్.ఏసుపాదం కావలి

** ఏ నిర్మాణాల సమీపంలో గృహస్తు నివసించరాదు?*

ఆలయాలు, స్మశానాలు, ఆస్పత్రులు, దర్గాలు వున్న ప్రాంతాలలో దాదాపు నాలుగు వందల గజాలలోపు గృహస్తులు నివసించరాదని 'ధర్మ సింధు' గ్రంథం చెబుతోంది.

షేక్ దిల్‌షాద్ ఫిర్ధీ సికింద్రాబాద్

** గృహ ప్రారంభోత్సవాలకి 'జంతుబలి'ని మీరు సమ్మతిస్తారా?*

ద్వాదశ అష్ట శాస్త్ర గ్రంథాలలో సాత్విక బలులే తప్ప జంతు బలుల్ని గురించిన ప్రస్తావనలు లేవు. జంతుబలిని నేను అంగీకరించను. ఇది మధ్యలో పుట్టిన అపచారం.

మహదేవనాయర్ సముద్రపాళ్ల

** మిమ్మల్ని ఒకసారి మా ఊరికి తీసుకెళ్లాలన్నది మా కోరిక. గ్రామవాస్తులో చాలా లోపాలున్నాయని మా అభిప్రాయం.*

మీ అభిమానానికి కృతజ్ఞతలు. రాయచూరులో డాక్టర్ రంగనాథ్‌మిత్రా వాస్తు శాస్త్రజ్ఞులుగా మీకు తెలుసనుకుంటాను. వారు మంచి స్థితప్రజ్ఞులు. నా మాటగా వారికి చెప్పి, వారిని ఒకసారి మీ గ్రామానికి ఆహ్వానించండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

టివికె గూడూరు

** ఆమెకు ఏలినాటి శని వున్నదని పూజారి చెప్పారు.*

పుట్టిన తేదీ, నక్షత్రం ఏ గణాంకాలు చూసినా ఆమెది గురుదశ. శని ప్రస్తావన రాదు. పూజారికి జ్యోతిష శాస్త్రం తెలుసో, తెలీదో సరిగ్గా కనుక్కోండి.

సి.తులసీరాం నాయుడుపేట

** ఎన్ని మందులు వాడినా వ్యాధినయం కావడం లేదు. పరిష్కారం చెప్పండి?*

సృష్టిలో సైన్సుకు అందని ప్రశ్నలు చాలానే ఉన్నాయి. పశ్చిమ వాయువ్య ద్వారం సరైనదే. తూర్పు ఆగ్నేయ ద్వారాన్ని ఈశాన్యానికి మార్చండి. యంత్రం నిర్దుష్టమైన ఫలితాలనిస్తుంది ప్రయత్నించండి.

జె.రూపాబాయి నెల్లూరు

** సమస్యలు ఆకస్మికంగా వస్తూ భయంకర పరిస్థితుల్ని కలిగిస్తున్నాయి.*

నైరుతి సెప్టిక్ ట్యాంక్‌ను. ఉత్తరం ఉచ్ఛస్థానానికి 9X4.5X9.5 కొలతలతో నిర్మించుకోండి. శని ప్రభావ నివారణకు నీలం (ప్రధమార్ధం) ధరించండి.

ఎల్.భాగ్యలక్ష్మి గూడూరు

** బాగా తెలివైన పిల్లాడు. పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తున్నాయి.*

తూర్పు వాస్తు దోషాల్ని మొదట సరిచేసుకోండి. చిటికెన వ్రేలికి సంబంధిత రత్నధారణ, దైవగృహంలో గణపతి యంత్ర ప్రతిష్టచేయండి. ఆయుర్వేదంలో అశ్వగంధ, సరస్వతీ లేహ్యం కొంత జ్ఞాపకశక్తిని పెంచుతాయి.

ఇందిరమ్మ ఇళ్లకు మోక్షం లభించేనా?

2005 సంవత్సరంలో మొదలైన ఈ పథకానికి నిధులు ఉన్నాయో లేదో అన్న ఆలోచన చేయకుండా మొదలు పెట్టడంతో ఆదిలోనే హంసపాదు ఎదురయ్యింది. మళ్లీ ఈ పథకం తాలుకు ఫైళ్లు దులుపుతున్న గృహ నిర్మాణ శాఖాధికారులు ఈసారైనా ఈ పథకాన్ని సక్రమంగా చేపడితే బాగుంటుంది.

జిల్లాలో 2005వ సంవత్సరం నుంచి ఇందిరమ్మ పథకం పేరుతో గృహ నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలుత ఆదర్శ గ్రామపంచాయితీలను ఎంపిక చేసి ఆ తర్వాత పక్కా గృహాలతో పాటు, అంతర్గత రోడ్లు, విద్యుద్దీకరణ, త్రాగునీటి సరఫరా అందించాలని నిర్ణయించారు. ఈ పథకం ప్రారంభించిన ఏడాది తర్వాత అన్ని గ్రామాల్లో అర్హులైన వారందరికి ఇందిరమ్మ పథకం వర్తింపచేయాలని అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. దీంతో నిధులు వున్నాయా లేవా? అన్న విషయాన్ని పరిశీలించకుండానే ఇందిరమ్మ గృహాలు మంజూరు చేశారు అధికారులు. పక్కా గృహాలు నిర్మించుకోవాలన్న కోరికతో అప్పటివరకు వున్న పూరి గుడిసెలను తొలగించి పునాదులు త్రవ్వి గోడలు కూడా నిర్మించుకున్నారు. ఇంతవరకు బాగానే వున్నా లబ్దిదారులు సొంత నిధులతో నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేయడంలో గృహ నిర్మాణశాఖ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

బయట అప్పులు చేసి ఇళ్లు పూర్తి చేసుకున్న వారు గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల చుట్టూ బిల్లులు మంజూరు చేయాలని తిరిగి విసుగొచ్చి మిన్నకుండిపోవాల్సి వచ్చింది. మరికొందరికి ఆర్థికంగా చేయూత నిచ్చేవారు లేకుండా పోవడంతో మొండిగోడలకే పరిమితమైపోయి, ప్రక్కన పూరిగుడిసె ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నిధుల కొరత సాకుగా చూపిన అధికారులు గత రెండు సంవత్సరాల నుంచి ఇందిరమ్మ గృహాల గురించి పట్టించుకోవడం పూర్తిగా మానేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాల పనులు నిలిచిపోవడంతో ఈశాఖ అధికారులు, సిబ్బందికి పని లేకుండాపోయింది. భవిష్యత్‌లో ఈ పథకం వర్తింప చేస్తారా లేదా అన్నది సందేహంగా మారింది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి "ఇందిరమ్మ బాట" పేరుతో అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో గతంలో మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాల నిర్మాణం గురించి ప్రస్తావిస్తున్నారు సిఎం. అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాలకు బ్యాంకుల ద్వారా చేయూతనిస్తామని ప్రకటిస్తున్నారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం పాత రికార్డులకు దుమ్ము దులిపి లెక్కలను సరిదిద్దే పనిలో పడ్డారు.

గతంలో పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా వున్నవారికి 20వేల రూపాయలు రుణంగా అందించడం జరిగింది. గృహ నిర్మాణ వ్యయం భారీగా పెరగడం వల్ల పూర్తి కాకుండా పోయాయి. ఈ రుణం లేకుండా ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో 20వేల రూపాయలు మంజూరు చేసింది. ఈ నిధులు కొందరికి మాత్రమే అందగా, మరికొందరికి అందని పరిస్థితి. మండల స్థాయిలో పని చేసిన ఎఇ, వర్కుఇన్స్‌పెక్టర్లు భారీస్థాయిలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వున్నాయి. అధికారపార్టీ నేతల అండదండలతో అక్రమార్కులు బయట పడ్డారు. ముఖ్యమంత్రి అసంపూర్తిగా వున్న గృహ నిర్మాణాలను తిరిగి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించడంతోపాటు నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరారు. అవసరమైతే నిర్మాణ వ్యయాన్ని మరింత పెంచేందుకు వెనుకాడబోమన్నారు. ముఖ్యమంత్రి ప్రకటనతో లబ్దిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పాత బకాయిలు మంజూరు చేస్తే అప్పులు తీర్చుకొంటామని చెబుతున్నారు. అధికారులు ముందు చూపుతో వ్యవహరించకుంటే గృహనిర్మాణశాఖ పరువు బజారునపడే అవకాశం లేకపోలేదు.

మునిసిపాల్టీలో పరిస్థితి దారుణం

మునిసిపాల్టీ పరిధిలో చేపట్టిన గృహనిర్మాణాల పరిస్థితి మరింత అధ్వాన్నంగా వుంది. నెల్లూరు నగరంలో మూడు విడతలుగా దాదాపు 10వేల ఇళ్లకు పైగా మంజూరు చేశారు. నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి కొత్తూరు సమీపంలో వైఎస్సార్‌నగర్‌లో నిర్మాణాలు చేపట్టి స్వల్పంగా మాత్రమే ఇళ్లు కట్టారు. గృహ నిర్మాణాలను లబ్దిదారులకు కాకుండా కాంట్రాక్టర్లకు అప్పగించడం వలన నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణాలు జరిగాయి. కాంట్రాక్టర్లందరు అధికారపార్టీకి చెందిన నేతల అనుచరులు కావడంతో అధికారులు కూడా పెద్దగా నాణ్యతాప్రమాణాల గురించి పట్టించుకోలేదు. కాలవ్యవధి మించిపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. కొత్తూరు సమీపంలో ఇళ్లు నిర్మించి దాదాపు ఐదు సంవత్సరాలు కావస్తుంది. ఇప్పటివరకు గృహాలు ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో అసాంఘిక శక్తులకు నిలయంగా మారిపోయాయి. నగరానికి శివారున వుండడంతో పోలీసుల సందర్శన వుండడం లేదు.

మొత్తం మీద ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం మళ్లీ తెరపైకి రావడంతో నిధుల దుర్వినియోగానికి పాల్పడినవారిలో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం స్థలం సేకరించి ఇళ్లు నిర్మిస్తే అవి ఉపయోగంలోకి తీసుకురావడంలో అధికార యంత్రాంగం విఫలం చెందింది. కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించకపోవడం విశేషం.

భూ పంపిణీ లేదా?

జిల్లాలో భూ పంపిణీపై ప్రతిష్టంభన!

జిల్లాలో ఆరవ విడత భూ పంపిణీ కార్యక్రమం జరగలేదు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయన్న విషయమై రెవిన్యూ అధికారుల వద్ద నేటికీ స్పష్టమైన లెక్కలు లేకపోవడం బాధాకరం.

జిల్లాలో ఆరవ విడత భూ పంపిణీపై పరిపాలనాపరంగా కొంత ప్రతిష్టంభన ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయన్న సమాచారాన్ని రెవిన్యూ అధికారులు నేటికీ పూర్తిగా సేకరించలేకపోతున్నారు. గత నవంబర్ నెలలోనే ఆరవ విడత భూ పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించగా వివిధ కారణాల వల్ల ఈ కార్యక్రమం వాయిదా పడింది. గత ఎనిమిది సంవత్సరాల నుంచి భూపంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. అయినప్పటికీ భూముల వివరాలు సేకరించలేక పోతున్నారంటే రెవిన్యూ శాఖ అధికారులు ఎంత పారదర్శకంగా విధులు నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గత ఐదు విడతలుగా జరిగిన ఈ కార్యక్రమం ద్వారా పంపిణీ చేసిన భూములకు, చూపించిన భూములకు చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. ప్రతిసారి అధికారులు, ప్రజాప్రతినిధులు విమర్శలపాలవుతూనే ఉన్నారు.

అర్హులకు బదులు అనర్హులను లబ్దిదారులుగా ఎంపిక చేశారన్న ఆరోపణలున్నాయి. దాదాపు 30 సంవత్సరాల క్రితం భూ సంస్కరణల చట్టం అమల్లోకి వచ్చిన సమయంలో భూస్వాముల వద్ద ఉన్న మిగులు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. ఈ మిగులు భూములనే ఎస్సీ, ఎస్టీ, బిసిలకు అప్పట్లో పంపిణీ చేయడం జరిగింది. ఈ భూములు పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదుచేసిన అధికారులు కొన్ని భూములను భూస్వాముల ఆధీనంలోనే ఉంచేశారు. తొలివిడత భూ పంపిణీ కార్యక్రమంలో భూస్వాముల ఆక్రమణలో ఉన్న భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అప్పటి జిల్లా కలెక్టర్ రాజశేఖర్ ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు కిందిస్థాయి అధికారులను ఆదేశిస్తూ ఎప్పటికప్పుడు సమీక్షించేవారు. దీంతో రాష్ట్రంలో ఏ జిల్లాలో జరగని విధంగా మన జిల్లాలో 19వేల ఎకరాలు తొలి విడతలో పంపిణీ చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ చేసిన కృషికి ఫలితంగా ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవార్డుతో సన్మానించింది. అప్పటి జిల్లాలోని ప్రజాప్రతినిధులు కలెక్టర్‌పై అసంతృప్తితో ఉండినారు. వారు చెప్పినట్లు రాజశేఖర్ చేయకపోవడంతో అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చి జిల్లా నుంచి ఆయన్ను బదలీ చేయించారు.

ఆ తర్వాత జిల్లా కలెక్టర్లుగా వచ్చిన రవిచంద్ర, రామ్‌గోపాల్, ప్రస్తుత కలెక్టర్ శ్రీధర్‌రెడ్డిలు భూ పంపిణీపై పెద్దగా ఆసక్తి చూపలేకపోయారు. రవిచంద్ర హయాంలో పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు కేటాయించేందుకు చూపిన శ్రద్ధ, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన వారి సంక్షేమం, అభివృద్ధిపై చూపలేకపోయారన్న ఆరోపణలు మూటగట్టుకుపోయారు. జిల్లాలో సెంటు మాగాణి భూమిలేని నిరుపేదలు అనేక మంది ఉన్నారు. వీరందరూ కూడా ప్రభుత్వం భూములు పంపిణీ చేస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు మారినా ప్రభుత్వ భూములు పంచేందుకు గట్టి ప్రయత్నాలు చేసేవారు కరువయ్యారు. ప్రస్తుతం అధికారులు ఎంత భూమి సేకరించారు? ఎంత మంది లబ్దిదారులను ఎంపిక చేశారు. నియోజకవర్గాల్లో అసైన్‌మెంట్ కమిటీల ఏర్పాటు జరిగిందా? లేదా? అన్న సమాచారాన్ని వెల్లడించేందుకు ఏ అధికారి కూడా ముందుకు రావడంలేదు. అదిగో, ఇదిగో పంపిణీ చేస్తామంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు తప్ప స్పష్టమైన తేదీని ప్రకటించలేక పోతున్నారు.

ఐదో విడతలో పంపిణీ చేసిన భూములకు నేటికీ సరిహద్దులు చూపని పరిస్థితి. భూములకు సంబంధించిన పట్టాలు అందించి చేతులు దులుపుకున్నారు రెవిన్యూ అధికారులు. మెట్టప్రాంత మండలాల్లో భూసేకరణకు సర్వేయర్ల కొరత ఉంది. అవసరమైన సర్వేయర్లను నియమించకుండా భూసేకరణ ఎలా చేయాలని అధికారులు ప్రశ్నిస్తున్నారు. అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యేలతోపాటు తెలుగుదేశం ఎమ్మెల్యేలు సైతం భూపంపిణీ విధానంపై మాట్లాడడం లేదు. ఆరవ విడతలో ప్రభుత్వ భూములను పంపిణీ చేస్తారా లేకుంటే ఇతరులకు విక్రయించుకున్న ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని పంపిణీ చేస్తారా అన్నది సందేహంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూ పంపిణీ ఎలా చేయాలన్న దానిపై స్పష్టమైన ఉత్తర్వులు అందినప్పటికీ జిల్లా అధికారులు మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కలెక్టరేట్ నుంచి మండల తహశీల్దార్లకు ఆదేశాలు అందితే భూముల సర్వే, లబ్దిదారుల ఎంపిక జరిగే అవకాశం ఉంటుంది.

ఆరవ విడత భూ పంపిణీ కార్యక్రమం చేపడతారా లేదా అన్న అనుమానాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఏడు నెలల నుంచి ఈ కార్యక్రమం వాయిదా పడుతూ వస్తుంది. దళితులు, గిరిజనులకు సంబంధించిన భూములతోపాటు కొన్ని ప్రభుత్వ భూములు భూస్వాముల ఆధీనంలో ఉన్నాయి. భూములు ఆక్రమించిన భూస్వాములు ఏదో ఒక రాజకీయ పార్టీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు వీరికి అండగా నిలిచే అవకాశాలున్నాయి. ఈ కార్యక్రమానికి ఏర్పడిన ఆటంకాలను అధిగమించి ముందుకు వెళ్లాల్సిన అవసరం అధికార యంత్రాంగంపై ఉంది.

రెక్కలు తెగిన తూనీగ!

అల్లూరు రహీం

పద్మిని ఆర్ట్స్ పతాకంపై తయారైన తూనీగ తూనీగ చిత్ర నిర్మాణ సారథుల గూర్చి చాలా చెప్పుకోవాలి. ఈ సినిమాను ఒకప్పుడు రాష్ట్రంలో పెద్ద సారా కాంట్రాక్టర్, పెద్ద నిర్మాత, ఆ తర్వాత రాజకీయ నాయకునిగా ఎదిగిన మాగంటి రవీంద్రనాథ్‌చౌదరి మనుమడు రామ్‌చంద్రన్ నిర్మించాడు. మనసంతా నువ్వే, నువ్వొస్తానంటే నేనొద్దంటానాతోపాటు ఎన్నో హిట్ చిత్రాల నిర్మాతగా పరిశ్రమలో పేరుగాంచిన ఎం.ఎస్.రాజు ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఆయన కుమారుడు సుమంత్ అశ్విన్ హీరోగా నటించాడు. ప్రస్తుతం పరిశ్రమలో హిట్ నిర్మాతగా పేరుగాంచిన దిల్‌రాజు ఈ సినిమా నిర్మాణంలో భాగస్తుడు. ఇందరు ఉద్దండపిండాలు కలసి నిర్మించిన ఈ లవ్, ఎంటర్‌టైన్‌మెంట్, ఫ్యామిలీ డ్రామా ప్రేక్షకులను మురిపించలేక పోయింది. దిల్‌రాజు ఈ సినిమా విడుదలకు ముందు చెప్పినట్లు చిత్రానికి కథాంశం, తారాగణం, సాంకేతిక నిపుణులు ముఖ్యం. తూనీగ తూనీగ చిత్ర కథాంశం బాగుంది, సాంకేతిక నిపుణులు పరవాలేదు. తారాగణంతోపాటు రాజు గారి టేకింగ్ బలహీనమయ్యింది. ఈ సినిమాలో హీరోకు సంగీతమంటే పిచ్చి. హీరోయిన్‌కు జంతువులంటే ప్రేమ. కథలో కీలకపాత్ర పోషించే ఈ రెండు అంశాలను దర్శకుడు కనెక్ట్ చేయలేకపోయాడు. కార్తీక్ రాజా సంగీతం ఈ సినిమాను బలహీనపర్చింది. తొలిపాట తూనీగ తూనీగ మినహా మిగతా పాటలు పేలిపోయాయి. అయితే ఈ చిత్రంలో హీరో హీరోయిన్ల తొలి కలయిక, అతను ఆమెకు చంద్రోదయం చూపే సన్నివేశం, పావురం విన్యాసాలు, మేక కృతజ్ఞత, కోకడబ్బా క్రింద పడకుండా హీరో చేసే డ్యాన్స్ మాత్రం బాగున్నాయి. పరుచూరి బ్రదర్స్ వ్రాసిన డబ్బున్నోడు ఎప్పుడూ తప్పే, లవ్ టైం బ్యాలెన్స్, లవ్ ఈజ్ గాడ్, పేదవాడ్ని కొట్టగలరు... వాడిలోని ప్రేమికుడ్ని కొట్టలేరు డైలాగులు ఆలోచింపజేస్తాయి.



చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే బంగారు రాజు(విజయ చందర్) క్షత్రియ వంశీయుడు. ఆయన కుమారుడు రవీంద్రబాబు(నాగబాబు) వ్యాపారవేత్త. ఆయన స్నేహితులు డాక్టర్ జేమ్స్(షాయాజి షిండే), రామస్వామి(ప్రభు). రామస్వామి రవీంద్రబాబు ఇంట్లోనే వంటవాడిగా పనిచేస్తుంటాడు. రామస్వామి కొడుకు కార్తీక్(సుమంత్ అశ్విన్). రవీంద్రబాబు కుమార్తె నిధి(రియా) చిన్నప్పటి నుంచీ ఒకటే గొడవపడుతుంటారు. నిధి జంతు ప్రేమికురాలు. కార్తీక్ ఆమెను ఆట పట్టిస్తుండడం వల్ల చదువు పాడైపోతుందని తల్లి రాణి(సీత) నిధిని అమెరికా పంపేస్తుంది. చదువు సంధ్యలయ్యాక బంగారు రాజు 'వేయి పున్నముల' పండుగకు భారతదేశం వస్తుంది. ఈ కార్యక్రమాన్ని రవీంద్రబాబు తన బంధువులకు మాత్రమే పరిమితంచేసి ఆరుబయట ఏర్పాటుచేస్తాడు. ఈ క్యాంప్‌కు బంగారు రాజు కుమార్తె ఉషా(గీత), అల్లుడు(వినోద్‌కుమార్) వారి కుమార్తె నీతూ, కుమారుడు రాహుల్ కూడా వస్తారు. వ్యాపారంలో దెబ్బతిన్న వినోద్‌కుమార్ నిధిని తన కుమారుడు రాహుల్‌కు ఇచ్చి పెళ్లి చేయాలని ప్రయత్నాలు మొదలు పెడతాడు. ఈ క్యాంప్‌కు వచ్చే నిధి, కార్తీక్‌ల మధ్య కొంత కెమిస్ట్రీ జరిగి ప్రేమ పుడుతుంది. దీన్ని చూసిన నీతూ కార్తీక్‌పై అపనిందలు వేస్తుంది. వీటిని నమ్మి రవీంద్రబాబు రామస్వామి, కార్తీక్‌లను క్యాంప్ విడిచి వెళ్లిపొమ్మంటాడు. డ్యాన్స్‌పై మనసు లగ్నంచేసే కార్తీక్‌కు మళ్లీ టచ్‌లోకి వస్తుంది నిధి. మధ్యలో రాహుల్ కుట్రలు, కుతంత్రాలు తప్పించుకొని నిధి, కార్తీక్‌లు ఒకటవ్వడంతో తూనీగ తూనీగ పరిసమాప్తమౌతుంది.

తన కొడుకు సుమంత్ అశ్విన్‌ను హీరో చేసిన ఎం.ఎస్.రాజు అతనిలో హావభావాలు రాబట్టుకోవడంలో విఫలమయ్యాడు. హీరోయిన్ రియా కూడా పెద్ద గొప్పగా లేదు. ప్రేమకథలో హీరో, హీరోయిన్లు నీరసమైతే సినిమా ఎలా సక్సెస్ అవుతుంది రాజు గారు?



మా ఆవిడ చాలా మంచిది!

ఉపాసన మెడలో మూడు ముళ్లూ వేసి హీరో రామ్‌చరణ్ జీవితంలో కొత్త ఇన్నింగ్స్‌కి శ్రీకారం చుట్టారు. ఇటు కొత్త కాపురం, అటు సినిమా ముచ్చట్లను పిచ్చాపాటీగా చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితమే ఉపాసన నా జీవితంలోకి వచ్చింది. మగధీర విడుదలైన తర్వాతే... తనతో పరిచయమైంది. నిన్ను అందరికంటే ఎక్కువగా ప్రేమించేది ఉపాసనే అని నా స్నేహితులు తరచూ చెబుతుండేవారు. నాకు అది నిజం అనిపించింది. ఎందుకంటే నా విషయాల్లో ఉపాసన చాలా జాగ్రత్తలు తీసుకొనేది. తనే నా జీవిత భాగస్వామి అనుకొన్న క్షణమే నా మనసులోని నిర్ణయాన్ని తనకు చెప్పేశా. అమ్మానాన్నలు కూడా చాలా సంతోషించారు. పెళ్లి అయ్యాక మా ఇంట్లో వారితో ఎలా సర్దుకుపోతుందో, కొత్త వాతావరణంలో ఎలా ఇముడుతుందో అని రకరకాలుగా ఆలోచించేవాడిని. కానీ తను చాలా తొందరగా మా ఇంటి మనిషైపోయింది. అమ్మ సలహాలు తీసుకొంటూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతుందని శ్రీమతిని ప్రశంసించాడు రామ్‌చరణ్.



ఐటెం పాటలు చేయను!

బాలీవుడ్‌లో ఇప్పుడు ప్రత్యేక గీతాల హవా నడుస్తోంది. స్టార్ కథానాయికలంతా అటువంటి పాటల్లో మెరుపులు మెరిపించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఆసిన్ కూడా ఇందుకు సిద్ధంగానే ఉందా? ఈ విషయం ఆమెను అడిగితే 'ఐటెమా'? అసలు ఆ పదమే నాకు నచ్చదు. హీరోయిన్లు ఓ పాటలో నటిస్తే దానికి ఇంత ప్రాముఖ్యత ఎందుకు ఇస్తారో నాకు అర్థం కాదు. ఐటెమ్ పాట అనగానే ఓ మసాలాగీతం అనే దృష్టితోనే చూస్తారు. ఈ పద్ధతి నాకు అస్సలు నచ్చదు. అలాంటప్పుడు ప్రత్యేక గీతాల్లో ఎందుకు నర్తిస్తాను? అయితే ఐటెం పాటలకు పచ్చజెండా ఊపేవారికి నేనేం వ్యతిరేకిని కాను. ఇక్కడ ఎవరి ఇష్టం వారిది అని బదులిచ్చింది.

వీధి ఊడ్చిన అనుష్క!

తాండవం చిత్ర షూటింగ్ ఇటీవల లండన్‌లో జరిగింది. ఓ వీధిలో టపాసులు పేల్చే సన్నివేశాలు చిత్రీకరించారు. షూటింగ్ మూలంగా వీధి మొత్తం చెత్తాచెదారం పేరుకొంది. ఇంతలో షూటింగ్ పూర్తయ్యింది. హీరోయిన్ అనుష్క చీపురు తీసుకొని వీధిని ఊడ్చనారంభించింది. హీరో విక్రమ్ ఆమె ఊడ్చిన చెత్తను సంచుల్లో ప్యాక్‌చేసే పనిలో పడ్డాడు. లండన్‌లో శుభ్రత... పరిశుభ్రత బ్రహ్మాండం. షూటింగ్ మూలంగా భారతీయులు వీధిని ఖరాబు చేశారనే పేరు రాకూడదని హీరో, హీరోయిన్లు ఈ పని చేపట్టడంతో యూనిట్ మొత్తం వారిని అనుకరించక తప్ప లేదన్నారు దర్శకుడు ఎ.ఎల్.విజయ్.



ప్రకాష్‌రాజ్ ప్రేమకథ



పలు రకాల పాత్రల పోషణ ద్వారా దక్షిణాదిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్న నటుడు ప్రకాష్‌రాజ్. ఆయన్ను ఆకర్షించి మూడు ముళ్లు వేయించుకొంది నృత్య దర్శకురాలు పోనీవర్మ. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమె తమ ప్రేమ, పెళ్లి అనుభవాలు చెప్పింది. ఆయన్ను హైదరాబాద్‌లో ఏడేళ్ల క్రితం చూశాను. నటుడిగా ఆయన ఘనత నాకు తెలియదు. ఫోన్ నెంబరడిగితే ఇచ్చా. తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ప్రేమలో పడిపోయాం. సినిమాల్లో చూపించినట్లు ఓ పూలబొకే ఇచ్చి తన ప్రేమను వ్యక్తం చేశాడు. నేను ఇంట్లో చెప్పాల్సిన్నాను. అదృష్టవశాత్తు వాళ్లు పచ్చజెండా ఊపారు. ఒకప్పుడు నేను డ్యాన్సర్ని. సినిమాలే నా లోకం. ఇప్పుడు ప్రకాష్ తర్వాతే ఎవరైనా. నాలోనూ ఓ సగటు మహిళ ఉంది. ఇల్లు, భర్త, సంసారం అంటూ కలవరిస్తుంటాను. ప్రేమ, జీవితం, ఆశయం అనే పదాలకు అర్థం ఆయన వల్లే తెలిసిందంది పోనీవర్మ.

పోలీస్ దెబ్బకు - ఖజానా అధికారి బదలీ!

మిగతా ట్రెజరీల సంగతేమిటి?

జిల్లా పోలీస్ ఉన్నతాధికారి చేసిన ఫిర్యాదుతో ఖజానా అధికారిణి నాగమాంబ బదలీ ఆఘమేఘాలపై జరిగిపోయింది. పోలీస్ అధికారుల సంఘం నేతలతో వివాదం కాస్త అసలుకే ఎసరు తెచ్చినట్లయ్యింది. జిల్లా ఖజానా కార్యాలయంతోపాటు ఉప ఖజానా కార్యాలయాలు అవినీతి జమానాగా మారిపోయాయి. ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన వివిధ బిల్లులు మంజూరు ఖజానా కార్యాలయంలో చేయాల్సి ఉంటుంది. సరెండర్ లీవులు, మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ బిల్లులు చేసేందుకు ట్రెజరీల్లోని సిబ్బంది నిలబెట్టి వసూలు చేస్తారనేది అందరికీ తెలుసు. ఈ అవినీతిలో అధికారుల పాత్ర కీలకం. జిల్లాలో 2500 మంది పోలీసుల సరెండర్ లీవులకు సంబంధించి పెద్ద మొత్తంలో బిల్లులు నిలిచిపోయాయి. వీటి విషయమై పోలీస్ అధికారుల సంఘం నేతలు ట్రెజరీ డిడి నాగమాంబను కలిశారు. అయితే ఈ బిల్లులు చేసేందుకు ఆమె గొంతెమ్మ కోరికలు విని ఆశ్చర్యపోయారు వారు. తనకు ఒక స్విఫ్ట్ ఎసి కావాలని, కారుకు పోలీస్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి ఉచితంగా డీజిల్ సప్లై చేయాలని డిమాండ్ చేసిందట. నాగమాంబ కోరికలు విని పోలీసులు నిర్ఘాంతపోయారు. సందెట్లో సడేమియాగా ఆమెతో మాట్లాడుతూ అవన్నీ సెల్ ఫోన్‌లో రికార్డు చేశారట. పలుమార్లు బిల్లుల కోసం తిరిగినా ఆమె విసురుగా మాట్లాడడం, కార్యాలయం చుట్టూ తిప్పుకొంటుండడంతో ఈ విషయాన్ని ఎస్పీ రమణకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన ఎస్పీ నేరుగా ఆమెకు ఫోన్‌చేసి తీవ్రంగా మందలించడంతోపాటు ఆర్థిక శాఖ కార్యదర్శికి, డిజిపికి ఫిర్యాదు చేశారు. నాగమాంబ వ్యవహారశైలి తెలుసుకున్న ఉన్నతాధికారులు క్షణాల్లో ఆమెను జిల్లా నుంచి బదలీ చేయడమే కాకుండా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా గాలిలో పెట్టారు. ఈ దెబ్బకు ఖజానా సిబ్బందికి వెన్నులో వణుకు పుడుతోంది. నెల్లూరుతోపాటు, కావలి, కోవూరు, పొదలకూరు, బుచ్చి, ఇందుకూరుపేట, ఆత్మకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, ఉదయగిరి, గూడూరు, వాకాడు, వింజమూరులలోని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి. దీనిపై ఎసిబి దృష్టిసారించినట్లైతే ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో మేలుచేసిన వారవుతారు. అయితే పోలీస్ అధికారులను లంచం అడిగినందుకు ఆ అధికారిని బదలీ చేయడం బాగానే ఉన్నా తమ శాఖలోని లంచావతారులపైనా ఇలాగే స్పందిస్తే జనం హర్షిస్తారు.



నెల్లూరు ఇందిరాభవన్ రోడ్డులో బాలాజీ డయోగ్నొస్టిక్స్ సెంటర్ ప్రారంభిస్తున్న తిరుపతి స్విమ్స్ ఫార్మర్ డీన్ డాక్టర్ ఎం.కుమారస్వామిరెడ్డి. ప్రక్కన నిర్వాహకుడు డాక్టర్ శ్రీనివాసులు తదితరులు.

మంచి ట్రాఫిక్ కానిస్టేబుల్!



వేణుమాధవికి పుస్తకాలు అందిస్తున్న కానిస్టేబుల్ సతీష్‌కుమార్.

నెల్లూరు నగరంలో పనిచేసే ట్రాఫిక్ కానిస్టేబుళ్ల గూర్చి ప్రత్యేకంగా చెప్పబని లేదు. కానీ వీళ్లలో ఓ మంచి కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. ఆయనే వై.సతీష్ కుమార్. తన స్వంత డబ్బుతో మూలపేటలోని రామయ్యబడిలో పదవ తరగతి పరీక్షల్లో ప్రథమునిగా నిలిచిన వారికి ఏదో ఒక రకంగా గత కొన్నేళ్లుగా సహాయపడుతున్నాడాయన. ఈ యేడాది ఈ స్కూల్ టాపర్ ఎస్.పి.వేణుమాధవికి ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ టెక్ట్స్ బుక్స్, 2011లో టాపర్ రాముకి సెకండ్ ఇయర్ పుస్తకాలు ఇప్పించారాయన. కానిస్టేబుళ్లలో ఈ దాతృత్వాన్ని రామయ్య బడి హెడ్‌మాస్టర్ తోట మధుమోహన్ అభినందించారు.

ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలేవి?

● యదేచ్ఛగా సాగిపోతున్న లారీలు!

ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలో అధిక లోడ్‌తో ప్రవేశిస్తున్న వాహనాల గురించి రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా గ్రానైటు లోడుతో వాహనాలు ఎక్కువగా వెళుతున్నాయి. వీటిని జాతీయ రహదారిపై రవాణా శాఖ అధికారులు తనిఖీచేసి అపరాధరుసుం విధించవచ్చు. అయితే సిబ్బంది కొరత సాకుగా చూపి జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహనాలను తనిఖీలు చేయలేకపోతున్నట్లు చెబుతున్నారు. తరచూ గ్రానైటు లోడుతో చెన్నై వెళ్లే వాహనాల యజమానులతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాహనాలను తనిఖీ చేస్తే రాష్ట్ర ఖజానాకు కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. రాష్ట్రంలో ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల తర్వాత ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖల్లో రవాణా శాఖ ప్రధానమైంది. కొన్ని సందర్భాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు అధిక లోడ్‌తో వెళుతున్న వాహనాలను తనిఖీచేసి రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తుంటారు. ఇటీవల ప్రైవేటు ట్రావెల్స్, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులపై దాడులు చేసి కొన్ని బస్సులను సీజ్ చేయడం జరిగింది. నిత్యం ఇదే విధానాన్ని కొనసాగిస్తే బస్సులను పూర్తి కండీషన్‌లో ఉంచడంతోపాటు ప్రమాదాలు జరగకుండా నియంత్రించే అవకాశం ఉంటుంది. అలా కాకుండా సంవత్సరానికోసారి బస్సులను తనిఖీలు చేయడం వలన ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పోతోంది. ఇప్పటికైనా ఆర్టీఏ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

● ప్రభుత్వ స్కూళ్లలో

విద్యార్థులకు యూనిఫామ్‌లెప్పుడు?

దర్జీల కుట్టు కూలీ నిర్ధారించలేదు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఒకే రకమైన దుస్తులను తయారు చేయించి అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేసవి సెలవులకు ముందే ఈ నిర్ణయం తీసుకుని దుస్తుల తయారీకి సంబంధించి కొలతలు తీసుకోవాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను విద్యాశాఖ ఆదేశించింది. అయితే ఇప్పటివరకు ఇది ఒక కొలిక్కి తీసుకురాలేక పోతున్నారు. బాల బాలికలకు యూనిఫారం పాఠశాలలు తిరిగి పునఃప్రారంభించిన తర్వాత అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. విద్యార్థుల యూనిఫారం తయారీ ఆప్కోకు ఇవ్వాలని డిమాండ్ రావడంతో విద్యాశాఖ ఆలోచనలో పడింది. పాఠశాలలు ఉన్న ప్రదేశంలో టైలర్లను ఆహ్వానించి దుస్తుల తయారీ చేయించాలని తొలుత భావించినా ఛార్జీల విషయంలో స్పష్టత లేకుండా పోయింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు దుస్తులు కుట్టేందుకు టైలర్లు నిరాకరించారు. పెరిగిన ధరలకు అనుకూలంగా ఛార్జీలు చెల్లించాలని టైలర్లు కోరడంతో అందుకు అధికారులు అంగీకరించడం లేదు. దుస్తులు మరికొన్ని నెలలు అందకుండాపోయే అవకాశం ఉంది.

మునిసిపల్ కొళాయిల్లో రంగు నీళ్లు!

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొళాయిల్లో రంగు నీళ్ల సరఫరా అవుతున్నాయి. చాలా ఏళ్ల క్రితం వేసిన తాగునీటి సరఫరా పైపులను మార్చకపోవడం కారణంగా అవి బాగా తుప్పుపట్టిపోయాయి. ట్యాంకు నుంచి నీటిని వదిలిన సమయంలో నీరు ఎరుపు రంగుగా మారిపోయి ఉంటుంది. దీంతో అప్పటివరకు తాగునీటి కొళాయిల వద్ద గంటల తరబడి నిరీక్షించిన మహిళలు అధికారులను శాపనార్థాలుపెడుతూ ఇంటి దారి పడుతున్నారు. నగరంలో కొన్ని డివిజన్లలో ఇదే పరిస్థితి ఉంది. మరికొన్ని డివిజన్లలో సక్రమంగా తాగునీటి సరఫరా కాకపోవడం వల్ల బయట వాటర్ క్యాన్లను కొనుగోలు చేయక తప్పడం లేదు. మొన్నటివరకు 15 నుంచి 20 రూపాయలు ధర పలికిన వాటర్ క్యాన్ ప్రస్తుతం 25 నుంచి 30 రూపాయల వరకు ప్రజల అవసరాలను బట్టి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు వ్యాపారులు. నగరంలో త్రాగునీటి సరఫరా చాలా అధ్వాన్నంగా తయారై ఉంది. నగర వాసులు ఇబ్బంది పడుతుంటే మరో ప్రక్క అధికారులు అంతా సవ్యంగా ఉందంటూ చెబుతున్నారు. కార్పొరేషన్‌కు ప్రత్యేకాధికారిగా ఉన్న అదనపు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం స్పందించి తాగునీటి సరఫరా సక్రమంగా చేయడంతోపాటు తుప్పుపట్టిన పైపులైన్లను మార్చాల్సిన అవసరం ఉంది.



పొదలకూరురోడ్డులోని కొళాయిల్లో రంగునీళ్లు పట్టుకొంటున్న మహిళ. ఇన్‌సెట్‌లో సీసాలో రంగునీళ్లు.

ఫ్యాక్షన్ అలవాటు పాటిస్తున్నారా?

మొదటి పేజీ కొరవ

పీఠం మీద ఆశీనుడౌతాడనే నమ్మకంతో వున్నవారికి మరింత బాధగా వుంది.

జగన్ రాజీ ప్రయత్నం నిజం కాదని చెప్పడానికి ఎవరికీ సాహసం చాలడం లేదు. ఒకదాని వెంట ఒకటిగా జరుగుతున్న రాజకీయ పరిణామాలన్నీ దాన్ని బలంగా ధృవ పరుస్తున్నాయి. వైఎస్. విజయమ్మ సిరిసిల్ల పర్యటనకు కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన భద్రతా ఏర్పాట్లు అందుకొక సంకేతం. తెలంగాణపై స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేయకుండా తమ ప్రాంతానికి ఎవరు వచ్చినా ప్రతిఘటించడం తెలంగాణ ఉద్యమకారులకు ఆనవాయితీగా మారింది. గతంలో వైఎస్.జగన్ మహబూబాబాద్ వెళ్లినప్పుడు రాళ్ల రప్పలతో యుద్ధ వాతావరణం సృష్టించారు. ఆనాటి రోశయ్య సర్కారు ఆ ఆందోళనను మౌనంగా చూసిందే తప్ప జగన్‌కు రక్షణ కల్పించడానికి చిన్నపాటి ప్రయత్నం కూడా చేయలేదు. కానీ ఇప్పుడు మాత్రం కిరణ్ సర్కారు వైఎస్ విజయమ్మ పర్యటన విజయవంతమయ్యేందుకు అంచనాలకు మించిన పోలీసు బలగాలను రంగంలోకి దించింది. హైదరాబాదు నుంచి సిరిసిల్ల వరకు అడుగడుగునా ఎర్ర టోపీ సైన్యాన్ని నిల బెట్టింది. ఉద్యమకారుల పట్ల కఠినంగా వ్యవహరించింది. నిరసన తెలిపే వారిని లాఠీలతో చావ బాదింది. ఈ మార్పుకు కారణం ఏమిటి? జగన్ పట్ల ప్రభుత్వ సానుకూలత తప్ప ఇందుకు వేరే కారణం అంటూ ఏదీ కన్పించడం లేదు. పోలీసు సహకారం లేకుంటే వైఎస్ విజయమ్మ హైదరాబాదు పొలిమేర్ల దాటి వెళ్లగలిగేది కాదనడం నిజం.

ఉజ్వలమైన రాజకీయ భవిష్యత్తును నాశనం చేసుకొని, ప్రజలు తనపై పెట్టుకొన్న నమ్మకాన్ని ఒమ్ము చేసి జగన్ ఎందువల్ల కాంగ్రెస్‌తో చెలిమి చేస్తున్నాడు? జైలు నుంచి బయటకు రాలేనని భయం ఆయనలో పెరిగిపోయిందా? కేసుల ఊబిలో కూరుక పోతాననే నిస్పృహ ఆవరించిందా? అదే నిజమనుకొంటే, ఆయన్ను కేసుల నుంచి తప్పించడం కాంగ్రెస్‌కు ఎట్లా వీలౌతుంది? వీరిద్దరూ కలిసి సిబిఐని, న్యాయస్థానాలను లొంగ దీసుకోగలమనుకొంటున్నారా? అది అంత సులభమా? సుప్రింకోర్టులో జస్టిస్ కపాడియా వంటి వారు ఇంకా వున్నారన్న విషయాన్ని మరిచిపోతున్నారా? కాంగ్రెస్‌తో చేతులు కలిపితే జగన్ చేసిన నేరాలన్నీ మాసిపోతాయా? వేల కోట్ల రూపాయల దోపిడీ చట్టబద్దమౌతుందా?

ఏది ఏమైనా జగన్, కిరణ్‌కుమార్‌రెడ్డి మధ్య ఏదో అనైతిక ఒప్పందం అమలౌతున్నదని జనం సందేహించేట్లుగా వున్నాయి పరిణామాలు. ఈ ఒప్పందం కుదిరిన నాటి నుంచి జైలులో జగన్ జీవనశైలి కూడా పూర్తిగా మారిపోయిందని చెప్పున్నారు. రోజంతా బయటి వ్యక్తులతో సంభాషించడానికి సెల్ ఫోన్ సౌకర్యం, రాత్రిపూట నిద్రకు జైలరు గదిలో ఎయిర్ కండీషన్ వసతి, పగలు సేవలందించడానికి ఖైదీ నౌకర్లు జగన్‌కు లభిస్తున్నట్లు వినికిడి. జైలులో నుంచే ఆయన తన పార్టీ వ్యవహారాలను, వ్యాపార లావాదేవీలను నిక్షేపంగా చక్క బెట్టుకొంటున్నాడని చెప్తున్నారు.

కానీ ప్రజలు ఈ ఒప్పందాలను ఎట్లా స్వీకరిస్తారన్నదే ప్రశ్న. నిన్నటి వరకు తమ ముందు విప్లవ వీరుడి వలె బీరాలు పోయిన జగన్, కాంగ్రెస్ అధినాయకత్వం ముందు మోకరిల్లితే, జనమూ ఆయన్ను అనుసరిస్తారనుకోవడం పెద్ద పొరపాటు. నయ వంచనను జనం ఎప్పుడూ క్షమించరు, సహించరు. రాజీ మార్గంలో జనం ముందుకు వస్తే అటు జగన్, ఇటు కాంగ్రెస్ పార్టీ రెండూ కూడా చాలా చేదు అనుభవాలను చవి చూడవలసి వస్తుంది.

ఉపఎన్నికల ప్రచారంలో వైఎస్ విజయమ్మ లేవనెత్తిన ప్రధాన అంశం – తన భర్తను హత్య చేశారన్న అనుమానం. కాంగ్రెస్ నేతలే వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని చంపించారన్న సందేహం తమకున్నదని ప్రతి సభలో చెప్పారామె. కానీ విచిత్రంగా ఎన్నికలు ముగియగానే ఆ అంశాన్ని పక్కన పెట్టేశారు. ప్రధానిని కలవడానికి ఢిల్లీ వెళ్లినప్పుడు కూడా ఈ విషయం ప్రస్తావించలేదు. వైఎస్ మరణం ప్రమాదం వల్ల జరగలేదని, అది హత్య అనే అనుమానం ఆమెకు, ఆమె పార్టీకి నిజంగా వుండి వుంటే – ప్రధానిని కలిసినప్పుడు విచారణ ఎందుకు కోరలేదు? దాని అర్థం కేవలం ఎన్నికలలో ప్రజల సానుభూతి చూరగొనడం కోసం తన భర్త చావును రాజకీయ అస్త్రంగా వాడుకొన్నారన్న మాట. కట్టుకొన్న భర్త చావును కూడా రాజకీయ లాభం కోసం వాడుకొనే నీచమైన పోకడ ప్రజాస్వామ్యంలో క్షమించరానిది.

అంత హేయమైన ధోరణిలో రాజకీయాలు చేసే వారికి, రాజీ పడడం పెద్ద విషయం కాదు. ఫ్యాక్షన్ నేరస్తులకు అదొక సాంప్రదాయం కూడా. వీలు దొరికితే వేట కత్తులతో తలలు నరుకుతారు. వీలు కానప్పుడు రాజీ కుదుర్చుకొంటారు. జగన్ సైతం ఫ్యాక్షన్ నేపథ్యం నుంచి వచ్చిన వాడే కాబట్టి, రాజకీయాలలోనూ ఫ్యాక్షన్ పద్ధతులను ప్రవేశ పెడుతున్నాడన్న మాట.

మిగతా పార్టీలు బేజారు!

16వ పేజీ కొరవ

హెచ్చుతున్నది. మేము ఆ లెక్కలో సీట్లు ఇవ్వలేమంటే బిసిలు బాధ పడతారు. ఇద్దామంటే జరగని పని. ఔననూ లేక, కాదననూ లేక సతమతమౌతున్నారు అందరూ.

బిసిలలో మాత్రం ఈ నినాదం ఎక్కడలేని ఉత్సాహాన్ని కల్పిస్తున్నది. ఇంతకాలానికి తమకొక గుర్తింపు లభించిందన్న ఆత్మ సంతృప్తి కల్గుతున్నది వారిలో. బిసి కులాలలో యాదవ, గౌడ వంటి వర్గాలకు రాజకీయ ఆశలు హెచ్చు. ఆర్థికంగా వారు మంచి స్థితిలో వుండడం అందుకొక కారణం. అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని తప్పించుకొని ఇప్పటికే అన్ని పార్టీలలో యాదవులు ఎంతో కొంత రాజకీయ అధికారం దక్కించుకొని వున్నారు. చంద్రబాబు నూరు సీట్ల పథకం నిజంగా ఆచరణకు వస్తే, ఈ రెండు వర్గాలు పెద్ద పీటను తన్నుక పోతాయి.

ప్రణబ్‌ముఖర్జీ

8వ పేజీ కొరవ

మనిషి ప్రణబ్. ఆ సమున్నత రాజ్యాంగ హోదాకు వన్నె తెచ్చే ప్రతిభా పాటవాలు ఆయన స్వంతం. స్వతహాగానే రాజ్యాంగ నిపుణుడాయన. ఇప్పుడు అదే రాజ్యాంగ పరిరక్షకుడిగా ఎన్నికైనాడు.

అయితే ప్రణబ్‌లోని స్వతంత్ర భావాలు, ముందు ముందు సోనియాగాంధీకి ఇబ్బందులు కల్గించవచ్చునన్నది రాజకీయ పరిశీలకుల వూహ. గతంలో జైల్‌సింగ్‌తో రాజీవ్‌గాంధీకి ఎదురైన చేదు అనుభవాలు సోనియాగాంధీకి కూడా తప్పక పోవచ్చునని అంచనా వేస్తున్నారు. అదెంత వరకు నిజమౌతుందో కాలమే తేల్చాలి.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

నగర్‌లోని సిటిజన్ స్కూల్ ప్రక్క మునిసిపల్ స్థలాన్ని దురాక్రమించి మసీదును ప్రారంభించారు. ఈ స్థలంపై ఎప్పటి నుంచో కన్నేసి ఉంచి మరికొంత మంది నేతలు ఈ విషయమై అగుడు సృష్టించారు. ఎవరో ఒకరిద్దరి ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకోవడం క్షమించరాని విషయం.

నెల్లూరులో ఇంత మంది అభిమానులా?

నెల్లూరు మినీ బైపాసు రోడ్డులో ఓ వెడ్డింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన సినీ నటి త్రిష తనను చూడను పెద్ద సంఖ్యలో వచ్చిన అభిమానులను చూసి విస్తుపోయింది. నెల్లూరులో నాకు ఇంత మంది అభిమానులా? ఈ ఊరు నాకు తెగనచ్చేసింది బాబో అంటూ గారాలు పోయింది.

కలక్టరేట్‌లో కట్టు తప్పుతుంది!

కలక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు తమకు తోచిన రీతిలో వ్యవహరిస్తున్నారు. ఈ వారంలో డిఆర్వో డ్రైవర్, జాయింట్ కలెక్టర్ డ్రైవర్లు కొట్టుకొని పెద్ద రగడే సృష్టించారు. ఇక్కడి నాల్గవ తరగతి ఉద్యోగులను కాస్త అదుపు చెయ్యండి కలెక్టర్ గారూ!

వివేకాకు కోపం వచ్చింది!

తాను రమ్మన్న సమయానికి దేవాలయానికి రాకపోగా, తన వ్యతిరేకికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన నెల్లూరు రాజరాజేశ్వరమ్మ దేవస్థానం సహాయక కమిషనర్‌ను రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి సెలవు పెట్టి వెళ్లిపొమ్మని ఆదేశించాడట. శ్రావణ శుక్రవారం రోజు వివేకా దేవస్థానానికి వెళ్తే ఇఓగా వ్యవహరిస్తున్న శ్రీనివాసులురెడ్డి ఏదో పనిబడి రాలేకపోయారు. అంతటితో ఊరుకొంటే పరవాలేదు. తన విరోధి, మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకడం వివేకా కోపానికి కారణమయ్యింది.

ప్రత్యేకాధికారుల పాలన

జిల్లా పరిషత్, మండల పరిషత్తుల్లో మరో ఆరు నెలలు ప్రత్యేక అధికారుల పాలన సాగుతుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది జూన్ 22వ తేదిన పాలక మండళ్ల గడువు ముగిసింది. అప్పటి నుంచి ఆరేసి నెలల వంతున ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ప్రజా ప్రతినిధులులేని అధికారుల పాలన ఏ విధంగా ఉంటుందో వివరించి చెప్పనక్కరలేదనుకొంటాం.

జైన్ చారిటబుల్ ట్రస్ట్ సహాయం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని కాన్సర్ హాస్పిటల్‌లో కొత్తగా కడుతున్న సర్జికల్ బ్లాక్‌కు భగవాన్ మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ నాలుగవ విడతగా 15 లక్షల రూపాయల విరాళాన్ని కాన్సర్ హాస్పిటల్ కన్వీనర్ తుంగా శివప్రసాద్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శాంతిలాల్‌జైన్, చంపాలాల్ జైన్, జె.వి.జైన్, వినోద్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

భాయ్... భాయ్... హాయ్... హాయ్!

ప్రణబ్ ముఖర్జీ, జగన్ భాయ్... భాయ్; సోనియాగాంధీ, విజయమ్మ హాయ్ హాయ్ అన్నట్లుంది ప్రస్తుతం రాజకీయ పరిస్థితి చూస్తుంటేనని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చమత్కరించారు. 22వ తేది నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్‌ల మధ్య రహస్య ఒప్పందం కుదరబట్టే ఆ పార్టీ రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రణబ్ ముఖర్జీకి ఓటు చేసిందన్నారు. జగన్ విడుదల, ఆ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న విషయమై విజయమ్మ, ఆ పార్టీ ఎమ్మీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలు విస్మయం గొలుపుతున్నాయన్నారు. కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు ఒకే తానులోని పేలికలని ఈ రెండు పార్టీలు త్వరలోనే ఒకటవుతాయని తేల్చి చెప్పారాయన.

ప్రసాద నాయుడుకు సన్మానం!

నెల్లూరీయుడు హైదరాబాద్‌లో స్థిరపడ్డ వాస్తు – జ్యోతిష – సంఖ్యాశాస్త్రవేత్త, శతబ్దరంగ జ్యోతిష రూపకర్త నల్లబోతుల ప్రసాద నాయుడును హైదరాబాద్‌లోని సుమన్ ఆర్ట్ థియేటర్స్ సుందరయ్య కళానిలయంలో దూరదర్శన్ శాంతిస్వరూప్ చేతుల మీదుగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయనకు జ్యోతిషరత్న బిరుదుతోపాటు ప్రతిభ పురస్కార్ 2012 ఇచ్చి సత్కరించింది.

జనవాణి

2వ పేజీ కొరవ

ఒక కమిటీ నియమించి ఇంటర్ విద్యావిధానంలో సమూలంగా మార్పులు తీసుకరావాలి. విద్యార్థులకు మార్కులతో పాటు విజ్ఞానం, సాంకేతిక పరంగా సామర్థ్యం పెరగడం అత్యావశ్యకం.

ఆర్.సుప్రజ నెల్లూరు


రాష్ట్రానికి దరిద్రం పట్టుకొంది!

ఒకప్పుడు అభివృద్ధి పథంలో వేగంగా పయనించి యావత్ దేశానికే తలమానికంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ నేడు తిరోగమన పథంలో పయనిస్తుండడం దురదృష్టకరం. గత ఆరు నెలల్లో పదిహేను ఐటి కంపెనీలు తమ కార్యకలాపాలను హైటెక్ సిటీలో ఆపివేశాయి. కొత్త కంపెనీలు మన రాష్ట్రం వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు. చెవర్లెట్ కంపెనీ నాలుగు వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభించబోయే కార్ల ఫ్యాక్టరీని మన రాష్ట్రం నుండి గుజరాత్‌కు మార్చేసింది. చిన్న మధ్య తరగతి కంపెనీలు సరైన ప్రోత్సాహకాలు లేక నష్టాల ఊబిలో కూరుకపోతున్నాయి. దీనికి కారణం ప్రభుత్వ అసమర్థత, రాజకీయ పార్టీల విపరీత పోకడలు, రాజకీయ అనిశ్చితి మాత్రమే. ఎంతసేపు అధికారం కాపాడుకోవడానికో లేక అధికారం చేజిక్కించుకునేందుకో రాష్ట్రాన్ని ముక్కలు చేసి పబ్బం గడుపుకునేందుకు యత్నించే రాజకీయ పార్టీలు తమ వైఖరి వల్ల రాష్ట్రానికి ఎంత కీడు చేస్తున్నాయో ఆలోచించడం లేదు.

పి.అరుణకుమారి నెల్లూరు

పదరంగం -26

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. క్రమాభివృద్ధి (5)
3. సానుభూతి (4)
6. కళ్ళజోడులో జోడు లేదు (2)
7. అటు నుంచి ప్రేమ, ఆసక్తి (2)
9. తపాలా, అటు నుంచి గానం (2)
10. పాము పడగ మీద కృష్ణతాండవం (6)
13. పుర్రె (4)
16. బంకించంద్ర చటర్జీ నవల (4)
17. ఉన్మాదము (2)
19. చిలకడానికి ఉపయోగించేది (3)
20. అటునుంచి పూరిగుడిసె (2)
22. బూరకాలు (4)
25. ... బుద్దారెడ్డి గారి ఇంటి పేరు (2)
26. ధోవతుల బంచ్ (5)
29. పుష్పం (2)
30. ఇతరులు (3)
32. బందీఖానా, నిలుపు 32 కూడా (2)
33. ఈ చెట్టు ఎక్కకండి (3)
34. టౌన్‌హాలు (6)

నిలువు

1. ప్రళయం కల్గిన సూళ్లూరు పేట సరస్సు (5)
2. 'నంది'ని ముందుచేర్చుకున్న ఒక తెల్లని పువ్వు (5)
3. ఇబ్బంది చివరిలో సున్న లోపించింది (3)
4. అన్నమయ్య గారి సర్‌నేమ్ (4)
5. విడుదల (2)
8. పండు కాదు (2)
11. వసంతం కొంచెం వెనకా ముందు అయింది (3)
12. బెంగాలీ నటీమణి.... బోస్ (5)
14. పాదరక్షలు (4)
15. కనిపించీ కనిపించని నవ్వు (6)
18. క్రింద నుంచి జాబు (2)
21. సర్పముల ద్వేషం (5)
23. పని (2)
24. తెలుగు వరల్డ్ (4)
25. ఆలయ శిఖరం (4)
27. అందమైన పంటల్లో రసం (2)
28. చింతపండు రుచి (3)
31. వెంట్రుక (2)
32. బందీఖానా అడ్డం 32 (2)

సమాధానాలు

పదరంగం -25

1గ	గా	రి	న్		2రా		3ఆ	4మా		5ని
గ				6పూ	జ		7న	వ	8నీ	తం
9న	యా	గ	రా		10రా	11మా			12లం	బం
కు				13వి	జ	య	గీ	తం		
14ను	మ	15ల	త		న				16బా	17వి
మం		వం		18ను	రేం	ద్ర	పు	రి		దే
	19ఖ	గం			ద్రు				20దే	శం
21పా	ర		22పా	కు	డు	23రా	24ళ్ళు		వి	
25ము	ము	26క్ష	వు			27జ	గ	మొం	డి	
ప		ద్ర		28కా	కి	నా	డ			29పా
30గ	త	ము		మి		31ల	వ	కు	శు	లు

సంక్షిప్త సింహపురి

రాజ్యలక్ష్మమ్మ జన్మదినోత్సవం!

మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ జన్మదినోత్సవాన్ని నేదురు మల్లి జనార్దన్‌రెడ్డి అభిమాన సంఘం నాయకుడు ముదిగొండ శ్రీనివాసులు నెల్లూరులో ఘనంగా చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో 250 మంది పేద మహిళలను గుర్తించి వారికి స్వయంగా వెళ్లి చీరలు పంపిణీ చేశారాయన. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శ్రీనివాసులుకు చేసిందేమీ లేదు. కానీ ఆయనంటే ఏమిటో అతనికి వీరాభిమానం. ఎవరి పిచ్చి వారికానందం.

ఎన్‌ఎండి చారిటీస్ సాయం



నెల్లూరు యాహ్యాలి వీధిలోని ఎన్‌ఎండి చారిటీస్ నేతృత్వంలో జెండా వీధిలోని పిఎన్‌ఎం స్కూల్‌లో చదివే 150 మంది విద్యార్థులకు వెయ్యి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చారిటీస్ నిర్వాహకుడు సయ్యద్ నిజాముద్దీన్ మాట్లాడుతూ ప్రపంచంలో పెద్ద పెద్ద గొప్ప శాస్త్రవేత్తలు, డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివారన్నారు. ఈ కార్యక్రమానికి స్పెయిన్ దేశంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రాఫెల్‌నిఖు, డాక్టర్ అమిత్ అగర్వాల్, పి.ఎన్.ఎం స్కూల్ హెడ్మాస్టర్ మహ్మద్ ఖలీల్‌అహ్మద్, చారిటీస్ సభ్యులు ఉదయ్, మసూద్, షాబుద్దీన్, రవి, ఖలీద్ పాల్గొన్నారు.

ప్రభవలో ప్రత్యేక ఆఫర్లు

నెల్లూరు పొగతోటలోని లాలిపాప్ ఎక్స్‌క్లూజివ్ కిడ్స్‌వేర్‌లో సీజన్స్ బెస్ట్ ఆఫర్‌గా ప్రతి కొనుగోలుపై 15 శాతం డిస్కౌంట్ అందిస్తున్నారు. అంతేగాక అన్నిరకాల బ్రాండెడ్ టీషర్ట్స్, షర్ట్స్, ట్యూనిక్స్‌పై మూడు కొంటే ఒకటి ఉచితం, అన్నిరకాల ప్యాంట్స్, బాటమ్స్‌పై రెండు కొంటే ఒకటి ఉచితం, కాటన్ ఫ్రాక్స్, పార్టీవేర్ డ్రస్సెస్‌పై రెండు కొంటే ఒకటి ఉచితం ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ అవకాశాన్ని నెల్లూరు ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

అర్బన్ బ్యాంకు అధ్యక్షునిగా మళ్లీ అమర్‌నాథ్!

నెల్లూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన కార్యవర్గ ఎన్నికలు 19వ తేది ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షునిగా జెసిఎస్ అమర్‌నాథ్, ఉపాధ్యక్షునిగా అరిగెల నాగేంద్రసాయిని ఎన్నుకొన్నారు. పాలకవర్గ సభ్యులుగా ముప్పల దశరధరామయ్య, వివేకం శాంతమ్మ, షేక్ అహ్మద్‌బాష, కనుపర్తి శ్రీనివాసమూర్తి, బైన వేణుగోపాల్, పిల్ల వేణు, జయకోటేశ్వరరావు, కొండ్ర గుంట వినోద, షేక్ సల్మా, సప్రం మహేశ్వరి, షేక్ మునీర్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వి.సదానందం చెప్పారు.

ఇంజనీర్ అభినందన సభ



నెల్లూరులోని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టౌన్ హాల్‌లో ఇంజనీర్ కొమ్మన సీతారామస్వామి అభినందన సభ జరిగింది. గాయకుడు పాటూరు శ్రీనివాసులు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖలో 40 ఏళ్ల నీతిగా పనిచేసిన వ్యక్తి సీతారామయ్య అన్నారు. ఆయన సాంస్కృతిక రంగంలో గాయకుడిగా, నటుడిగా సేవలందించి అక్కినేని నాగేశ్వరరావు చేత అభినందనలు అందుకొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి సి.వి.సుందరేశ్వరుడు, ఆచార్య ఆదిత్య, వల్లకవి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హెల్పింగ్ హ్యాండ్స్ సాయం!



నెల్లూరు శెట్టిగుంట రోడ్డులో ఒక కాలు లేకుండానే దర్జీ పనిచేసే సిరాజ్ కుటుంబానికి ఆసరా ఉండేందుకు ఆధునిక కుట్టు మిషన్‌ను హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసు ఆర్గనైజేషన్ అందించింది. ఈ మిషన్ విలువ పదివేలు. సిరాజ్ కుటుంబం బతకలేక ఇబ్బందుల్లో ఉన్న దృష్ట్యా ఈ సాయం చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు టి.కృష్ణారెడ్డి చెప్పారు.

తూతూ మంత్రంగా విద్యా పక్షోత్సవాలు

జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల మొదటి వారం నుంచి 20వ తేది వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యా పక్షోత్సవాలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. అన్ని గ్రామాల్లో విద్యార్థుల చేత ర్యాలీలు నిర్వహించి బడిమానేసిన పిల్లలు, ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో విద్యాపక్షోత్సవాలు నిర్వహించాలి. అయితే ఎంఇఓలు ఏ కారణం చేతనో ఈ కార్యక్రమంపై సరైన దృష్టి సారించలేక పోయారు. ఈ కార్యక్రమంతోపాటు బడిబాట పేరుతో మరో కార్యక్రమాన్ని నిర్వహించాలని విద్యాశాఖ భావించింది. ఎన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినా పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచలేక పోతున్నారు. ప్రధానంగా బాలికలు ఏడవ తరగతితోనే సరిపెట్టుకుని గ్రామాల్లో కూలి పనులకు వెళుతున్నారు. బాల, బాలికలను పాఠశాలల్లో చేర్పించాలన్న లక్ష్యంతో నిర్వహించాల్సిన పై కార్యక్రమాలను తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకోవడం విశేషం.



రైతు లోకం | బీరసాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు!

బీర తోటల్లో సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడి లభిస్తుందని ఉద్యానవనశాఖ అధికారులు తెలియజేశారు. అన్ని రకాల నేలల్లోనూ బీరను సాగు చేయవచ్చు. ఉదజని సూచిక 0-7 మధ్య వున్న ఎర్రగరప నేలలు, నల్లరేగడి నేలలు ఇందుకు అనువుగా వుంటాయి. నీరు నిలవని పొలాలు సాగుకు అనుకూలం. విత్తన మోతాదు ఎకరానికి 1400గ్రాములు. కిలో విత్తనాలకు ట్రైకోడర్మా విరిడి 5గ్రాములు లేదా మాంకోజెట్ 3గ్రాములు పట్టించి శుద్ధి చేయాలి. విత్తనశుద్ధి వల్ల పైర్లకు తొలిదశలో రక్షణ ఏర్పడుతుంది. వరుసల మధ్య 6మీటర్లు, పాదుల మధ్య 75సెంటీమీటర్ల దూరం వుండేలా విత్తుకోవాలి. ప్రతి పాదులోనూ నాలుగు విత్తనాలు విత్తి మొక్కలు మొలిచాక రెండు బలమైన మొక్కలు వుంచి మిగిలినవాటిని తొలగించాలి. పెరిగే మొక్కలకు పందిరి వేసి తాడు వూతంతో పైకి పాకించాలి. వీటిలో సంజీవని, అర్కసుజీత్, ఆర్కలాంగ్, మహిమ ఎన్‌ఎస్ - 401 వంటి హైబ్రీడ్ రకాలు ఆదరణ పొందాయి. ఎకరానికి 10టన్నుల పశువుల ఎరువు, 200 కిలోల వేపపిండి, 30 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాష్, 35 కిలోల నత్రజని ఎరువుల్ని ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.

విత్తిన 20రోజులకు ఒకసారి, పూత పిందె దశలో మరోసారి నత్రజని ఎరువుల్ని మొక్కలకు 10సెంటీమీటర్లు ఎడంగా చిన్న గొయ్యి తీసి అందులో వేసి మట్టికప్పి నీరందిస్తే ఎరువులు సద్వినియోగం అవుతాయి. గింజలు విత్తిన తర్వాత మొలక వచ్చేవరకు రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో చేతిపోత విధానంలో నీరందించాలి. దీని వల్ల మొక్కల మధ్య కలుపురావడాన్ని అరికట్టవచ్చు. ఆకుల దశ తీగపాకే సమయంలో వారానికి ఒకసారి నీటి తడినిస్తే పంట బాగా పండుతుంది.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

మంత్రుల సంఘం సూచనలు ఆచరణ సాధ్యం కాదు!

- పదవుల పందారం మంచిదే.
- కాపు కులాన్ని అక్కున చేర్చుకోవాలట!
- స్వంత పత్రిక, ఛానల్ కాంగ్రెస్‌కు ఎలా సాధ్యం.
- ఎమ్మెల్యేలు, మంత్రులు మారితే సగం సమస్య పరిష్కారం.

కాంగ్రెస్‌ను ప్రజలకు దగ్గర చేయడానికి మంత్రుల సంఘం 50 సలహాలిచ్చింది. 18 శాసనసభ స్థానాల ఉపఎన్నికలలో ఘోర పరాజయం తర్వాత పార్టీ కార్యకర్తలలో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టాలంటే ఏదో ఒకటి చేసినట్లు కన్పించాలి కాబట్టి, ఈ సంఘాన్ని నియమించారు. అందులో ఒకటికి 10 మంది మంత్రులను నియమించారు. ఈ సంఘం చేసిన ప్రధాన సిఫార్సు కార్యకర్తలకు అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో పదవుల పందారం. గ్రామ పంచాయితీ స్థాయిలో పార్టీ అధ్యక్షుడ్ని నియమిస్తే, ఆ స్థాయి నేతలకు పార్టీలో తామూ భాగస్వాములమన్న భావన కల్గుతుందని, ప్రభుత్వపరంగా కార్పొరేషన్ డైరెక్టర్లు, జిల్లాస్థాయి పదవులు అత్యవసరంగా భర్తీ చేయాలని సూచించారు వీరు.

ఇవి రెండూ మంచి సూచనలే. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి కార్పొరేషన్ పదవుల పంపకాన్ని పక్కన పెట్టేసింది ప్రభుత్వం. ఎప్పటికప్పుడు ఏదో ఒక నెపంతో వాయిదా వేస్తూ ఏళ్ల పూళ్ల కాలం గడిపేసింది. ఎమ్మెల్యేలను మాత్రం సంతోషపెడితే చాలనే ధోరణిలో పార్టీని నడిపాడు రాజశేఖర్‌రెడ్డి. వారిని నియోజకవర్గాలకు సామంతు రాజులుగా పెంచి పోషించాడు. దానితో దిగువస్థాయి పదవుల పంపకాన్ని ఎమ్మెల్యేలు అడ్డుకోవడం ఆనవాయితీ అయిపోయింది. ఎవరికి ఎన్ని అన్న వాటాల పంపకంలో పేచీ ఒక పక్క తమ అనుచరులు తమ కాళ్ల దగ్గర పడి వుండవలసిందే తప్ప తమతో సమంగా ప్రభుత్వ పదవుల భోగం అనుభవించరాదన్న సంకుచిత తత్వం మరొకప్రక్క కలగలిసి ఈ ప్రక్రియను నీరు గార్చి పారేశాయి. ఇప్పుడు మంత్రుల సంఘం గట్టిగా సిఫార్సు చేసినా, తీరా నియామకాల దశకు వచ్చేసరికి ఎమ్మెల్యేలు మళ్లీ అడ్డు పడడం తథ్యం.

వీరి సిఫార్సులలో మరొక కీలకమైనది – కుల పరమైన రాజకీయ వైఖరి. రాజకీయంగా సమాజం కులాల వారీగా విడిపోతున్నది కాబట్టి, పార్టీ విధానాలు సైతం ఆ ధోరణిలోనే వుండాలని సూచించారు మంత్రులు. జగన్, తెలుగుదేశం పార్టీలను రెడ్డి, కమ్మ సామాజిక వర్గాలు తమ స్వంతంగా భావిస్తున్నాయి కాబట్టి, జనాభా రీత్యా తర్వాతి స్థానంలో వున్న కాపు కులాన్ని కాంగ్రెస్ అక్కున చేర్చుకోవాలని వీరి సలహా. బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో వలె మనం కూడా కుల పరమైన రాజకీయాలు చేస్తే తప్ప నికరమైన ఓటు బ్యాంకు ఏర్పర్చుకోవడం కష్టమని మంత్రులు అభిప్రాయ పడుతున్నారు.

మూడవ ముఖ్య ప్రతిపాదన పార్టీ కోసం ఒక టీవీ ఛానల్, దినపత్రిక ప్రారంభించడం. జగన్ పట్ల జనంలో అంత ఆదరణకు ఏకైక కారణం సాక్షి పత్రిక అన్నది జగమెరిగిన సత్యం. అది వుండబట్టి, తతిమా పత్రికలలో తనపై వచ్చే విమర్శలను సమర్థవంతంగా తిప్పి కొట్టగల్గుతున్నాడు జగన్. ఎన్ని వేల కోట్ల అవినీతికి ఆధారాలు దొరికినా ప్రజల దృష్టిని మళ్లించగల్గుతున్నాడు. అదే సమయంలో కాంగ్రెస్, టిడిపిల మీద పచ్చి అబద్ధాలను సైతం పరమ సత్యాలుగా ప్రచారం చేసి, ప్రజలు నమ్మేట్లు చేస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆ స్థాయిలో ఒక పత్రిక, టీవీ ఛానల్ వుంటే ప్రజలకు ఎప్పటికప్పుడు పార్టీ వాదనలను వివరించి చెప్పేందుకు వీలౌతుందన్నది మంత్రుల సూచన.


అయితే జగన్‌ది స్వంత పార్టీ. అదొక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ. అందులో ఆయనొక్కడే నాయకుడు. తతిమా వారంతా పనోళ్ల క్రింద లెక్క ఆయన చెప్పిందే విధానం. పార్టీలో ఎంత ఉన్నత స్థానంలో వున్న నేతకైనా స్వంత అభిప్రాయాలంటూ వుండడానికి లేదు. రోజూ జరిగే ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో సైతం జగన్ ముందుగా ఏది చెప్పమంటే అదే చెప్పాలి. కానీ కాంగ్రెస్ ప్రజాస్వామిక పార్టీ. దానికి ఒక నేత అంటూ వుండడు. పార్టీలోని సభ్యులం దరూ నేతలే. ఎవరికి తోచిన అభిప్రాయాలను వారు స్వేచ్ఛగా వ్యక్తం చేస్తూ వుంటారు. ఒక్కొక్క నాయకుడిది ఒక్కొక్క అజెండా. పార్టీలోని నేతలకు ఒకరంటే ఒకరికి పడదు. ఒకరి ఎదుగుదల మరొకరు చూడలేరు. కాంగ్రెస్‌కు ప్రతిపక్షం అంటూ వేరొకటి అవసరం లేదని, పార్టీకి పార్టీయే ప్రతిపక్షమని నానుడి. తమ సహచరుల మీద, చివరకు ముఖ్యమంత్రి మీద కూడా ఆరోపణలు గుప్పించడానికి వెనుకాడరు. ఆ నేపథ్యంలో పార్టీ పత్రికను నడపడం ఎట్లా అన్నది ప్రశ్న. ఏ అంశం మీద ఏ వాదన విన్పించాలో చెప్పేది ఎవరు? వినేది ఎవరు?

జగన్ తన స్వంత అవసరాల కోసం పత్రిక నడుపుతున్నాడు కాబట్టి, ఎన్ని వందల కోట్ల రూపాయల నష్టమైనా భరిస్తున్నాడు. గత నాలుగేళ్లలో అధికారికంగా ప్రకటించిన నష్టాలే 750 కోట్ల రూపాయలకు పైగా వున్నాయి. కాంగ్రెస్ పార్టీ తరపున అంత సొమ్ము సేకరించేది ఎట్లా? ఖర్చు లెక్కలు చూపేది ఎట్లా?

ఏ కోణం నుంచి చూసినా మంత్రుల సంఘం చేసిన ఈ సూచన ఆచరణకు సాధ్యం కాదని పసి పిల్లవాడు కూడా చెప్తాడు. అటువంటి సలహాను కీలకమైనదిగా అభివర్ణించి మరీ నివేదిక ఇచ్చారంటే, అసలు మంత్రుల సంఘం చిత్తశుద్ధి మీదనే సందేహం కల్గుతున్నది.

కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలలో ద్వేషం పెరగడానికి, అభిమానం చెరిగి పోవడానికి కారణం – పార్టీ నేతల ప్రవర్తన. ఎమ్మెల్యేలు, మంత్రులు తామేదో రాజులమన్న ధోరణిలో నడుచుకోవడం అలవాటై పోయింది. ప్రజలన్నా, కార్యకర్తలన్నా వారికి చులకన భావం. రాజకీయం వారి దృష్టిలో ఒక వ్యాపారం. దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకొన్నట్లు పదవి వున్నప్పుడే పది రూకలు పోగేసుకోవాలన్న కక్కుర్తితో వ్యవహరించడం అందరి తీరుగా మారింది. తమ కళ్ల ముందు జరుగుతున్న ఈ దుర్మార్గ రాజకీయాన్ని చూసిన జనం రాజకీయ వాదులంటేనే ఏవగించుకొంటున్నారు. పార్టీ పట్ల ప్రజలలో పూర్వపు అభిమానం ఏర్పడాలంటే మొదటగా చేయవలసిన పని, పదవులను దోపిడీకి లైసెన్స్‌గా భావించే ధోరణికి మంత్రులు, ఎమ్మెల్యేలు స్వస్తి పలకడం. అది జరగనంత కాలం ఎన్ని సంఘాలు, ఎన్ని సిఫార్సులు చేసినా వ్యర్థం.

కార్టూన్ స్పేస్



పర్మినెంటుగా ఆడుకొమ్మని ఇచ్చాడ్రా మా నాన్న!

- చంద్రబాబు బిసి నినాదంతో...

మిగతా పార్టీలు బేజారు!

చంద్రబాబు లేవనెత్తిన బిసిలకు వందల సీట్లనే నినాదం రాష్ట్ర రాజకీయాలలో సంచలనం సృష్టిస్తున్నది. ఉపఎన్నికలలో వరస ఓటములు చంద్రబాబును కలవర పరచాయి. తనను జనం నమ్మడం లేదని, తన ప్రభుత్వం మీద విశ్వసనీయత లేదని ఆయనకు బాగా అర్థమైంది. ఇదే కొనసాగితే మరొక ఐదేళ్లు అధికారానికి దూరంగా వుండక తప్పదనీ స్పష్టమైంది. ఏదో ఒకటి చేసి జనం దృష్టిని ఆకర్షించాలనుకొన్నాడు. ఎవరి సలహా మీదనో బిసి నినాదం ఎత్తుకొన్నాడు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు ఈ సామాజిక వర్గాలే ఆయన్ను అందలం ఎక్కించాయి. తెలుగుదేశం తమ స్వంత పార్టీ అన్నంత అభిమానం వారిలో కన్పించేది అప్పుడు. ఎన్టీఆర్ తోనే ఆ అనుబంధమూ పోయింది.

జనాభాలో వెనుకబడిన తరగతులది అగ్ర భాగం. ఏ నియోజకవర్గం చూసినా 40 శాతానికి తక్కువ కాకుండా బిసిలుంటారు. వారిలో ఐక్యత తేగలిగితే రాజకీయ అధికారం వేరొక సామాజిక వర్గానికి దక్కే అవకాశమే లేదు. ములాయం సింగ్ యాదవ్, నితీష్‌కుమార్, లల్లూ ప్రసాద్ యాదవ్ వంటి వారంతా వెనుకబడిన వర్గాలకు నేతలుగా ఎదిగి జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకొన్నారు. ఆ రాష్ట్రాలలో కాంగ్రెస్, బిజెపిలు తోక పార్టీలుగా మాత్రమే మిగిలిపోయాయి.

చంద్రబాబు పుణ్యాన ఇప్పుడు మన రాష్ట్రం లోనూ వెనుకబడిన తరగతులకు వెలుగు వచ్చింది. అయితే తరతరాలుగా వేళ్లూనుకొని వున్న అగ్ర కులాధిపత్యాన్ని పక్కనపెట్టి, మూడో వంతు సీట్లు బిసిలకు కేటాయించడం జరిగే పనా అన్నది ప్రశ్న. కాంగ్రెస్‌లో కానీ, తెలుగుదేశం కానీ కొన్ని తరాలుగా రాజకీయ కుటుంబాలు నియోజకవర్గాలను అంటిపెట్టుకొని వున్నాయి. అక్కడ పోటీ చేసే హక్కు తమకు మాత్రమే వుందనే ధోరణిలో వ్యవహిస్తున్నాయి. తండ్రి పోతే కొడుకు, భర్త పోతే భార్య తప్ప వేరొకరికి అవకాశం ఇవ్వడం లేదు. పార్టీ యంత్రాంగం సమస్తం వారి ఆధీనంలోనే వుండడం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో 100 నియోజకవర్గాలలో వెనుకబడిన తరగతుల వారికి అవకాశం ఇవ్వడం ఆచరణలో అసాధ్యం. కానీ ప్రజల దృష్టిని ఆకర్షించడానికి చంద్రబాబుకు అంతకంటే వేరొక మార్గం కన్పించడం లేదు. ఏ దిక్కులేని వాడికి దేముడే దిక్కన్నట్లు బిసి పల్లవిని పలవరిస్తున్నాడాయన. దీనితో తతిమా పార్టీలకు తల పోటు

కొరవ 14వ పేజీలో



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com